VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత ఐదు సంవత్సరాల నుండి నిరంతరాయంగా వెలువడుతున్న
'విభారె' తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలో
బ్యూరోలు మరియు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గ మరియు
మండలాల వారీగా విలేఖరులు కావలెను
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
8143193697, 9440232308

www.vibharenews.com
# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308, 9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 06-04-2023 సంపుటి : 04 సంచిక : 191 పేజీలు : 4 వెల : రూ 3-00

# ఎమ్మెల్యేల్లో, నాయకుల్లో అసంతృప్తి ఉంటే రీజినల్ కోఆర్డినేటర్లే బాధ్యత



అమరావతి ఏప్రిల్ 5 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాజయాలు చవిచూశాక ఏపీ సీఎం వైసీపీ అధినేత జగన్ దూకుడు పెంచారు. వరుసగా ఎమ్మెల్యేలు నియోజకవర్గాల ఇంచార్జులు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లుతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. ఇందులో భాగంగా పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లతో సమావేశం సందర్భంగా జగన్ హాట్ కామెంట్స్ చేశారు.ఎమ్మెల్యేల్లో నాయకుల్లో అసంతృప్తో అసమ్మతో ఉంటే రీజినల్ కోఆర్డినేటర్లే చూసుకోవాలి అని కోరారు. సీనియర్లు అని.. మీరు చేయగలరని నమ్మే కదా మీకు బాధ్యతలు అప్పగించానని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేల్లో అసంతృప్తి నియోజకవర్గాల్లో నాయకుల మధ్య అంతరాలు ఏమైనా ఉన్నాయా అని సీఎం జగన్ రీజినల్ కోఆర్డినేటర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గాల్లో నాయకుల మధ్య విభేదాలు ఉంటే మీరే చొరవ తీసుకుని పరిష్కరించండి అని రీజినల్ కోఆర్డినేటర్లకు సీఎం సూచించారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వచ్చే నాలుగు నెలల పాటు ఆగస్టు వరకు మరింత ఉధృతంగా చేపట్టేలా ఎమ్మెల్యేలను పర్యవేక్షించాలని కోఆర్డినేటర్లకు సూచించారు. అలాగే ఏప్రిల్ 7 నుంచి 20 వరకు 'జగనన్నే మన భవిష్యత్తు' ప్రచార కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగా 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్లను ఇళ్లకు ఆ ఇళ్లలోని వారి సెల్ఫోన్లకు అతికించే కార్యక్రమాన్నీ క్షేత్రస్థాయిలో పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత రీజినల్ కోఆర్డినేటర్లదేన ని జగన్ తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమాలను ఏ ఎమ్మెల్యే ఎలా నిర్వహించారనేదానిపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కోరారు.అదేవిధంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు చేపడుతున్న కార్యక్రమాలన్నీ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేందుకు మా నమ్మకం నువ్వే జగన్ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలూ కీలకమని సీఎం వెల్లడించారు.సచివాలయ సమన్వయకర్తలు గృహసారథులను వలంటీర్లతో మమేకం చేసి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆ కార్యక్రమాలన్నీ సజావుగా సమర్థంగా ఆయా నియోజకవర్గాల్లో నడిచేలా రీజినల్ కోఆర్డినేటర్లు పర్యవేక్షణ సమన్వయ బాధ్యతలు స్వీకరించాలని సీఎం సూచించారు. ఎన్నికలకు ఇంకా ఏడాదే సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలుగా కోఆర్డినేటర్లు ఓనర్షిప్ తీసుకోవాలని ఆదేశించారు. కోఆర్డినేటర్లు ఏ విషయాన్నైనా చర్చించవచ్చు.. ఎప్పుడైనా కలవవచ్చు అని సీఎం జగన్ వారికి తెలిపారు.ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్ది అందర్నీ ఒక్కతాటిపైకి తీసుకురావాలని కోరారు.

# 'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభం కోసం.. పల్నాడుకు సీఎం వైఎస్ జగన్



విజయవాడ, ఏప్రిల్ 5, ధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక సంక్షేమ విధానాన్ని ప్రారంభించనుంది. ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర సర్కారు.. అందులో భాగంగా మరో విధానాన్ని ఆవిష్కరించనుంది. ఫ్యామిలీ డాక్టర్ అనే విధానాన్ని ఏప్రిల్ 6వ తేదీన గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నూతన విధానాన్ని సీఎం జగన్ పల్నాడు జిల్లాలో ప్రారంభించనున్నారు.పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మండలం లింగం గుంట్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కావూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. వైద్య, ఆరోగ్య సేవలు రాష్ట్రం నలుమూలల విస్తరించాలన్న ఉద్దేశంతో పాటు ప్రతి ఒక్కరికీ స్పెషలిస్టు డాక్టర్ల సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రారంభించనుంది. దానికి ఫ్యామిలీ డాక్టర్ అనే పేరును పెట్టింది. ఈ విధానాన్ని రాష్ట్ర సర్కారు కొన్ని రోజులుగా దశలవారీగా ట్రయల్ రన్స్ నిర్వహిస్తూ వస్తోంది. అందులో మంచి ఫలితాలు రావడంతో ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేయాలని జగన్ ప్రభుత్వం సంకల్పించింది. గురువారం రోజు పల్నాడు జిల్లాలో సీఎం జగన్ ఫ్యామిలీ డాక్టర్ ను ప్రారంభించనున్నారు.గురువారం ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుండి సీఎం జగన్ బయలుదేరతారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో పల్నాడు జిల్లా లింగంగుంట్లకు చేరుకుంటారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ ఎంటర్ ను పరిశీలిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ స్టాల్స్ ను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అనంతరం కావూరు గ్రామంలో ఏర్పాటు చేసే సభకు హాజరై బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత సీఎం జగన్ తిరిగి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారని అధికారులు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం

ఫ్యామిలీ డాక్టర్స్ ద్వారా సాధారణ వైద్య ఆరోగ్య సేవలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి కూడా అందుబాటులోకి వస్తాయి. ఈ విధానంతో గ్రామీణ ప్రాంతంలో అనేక రోగాలకు సకాలంలో చికిత్స అందుతుంది. ఫ్యామిలీ డాక్టర్స్ రోగులకు నేరుగా చికిత్స అందిస్తారు. లేదంటే మెరుగైన చికిత్స కోసం స్పెషలిస్టు వైద్యులకు సిఫార్సు చేస్తారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం కింద గ్రామీణ ప్రాంతాల్లో వైద్య అవసరాలను ఆరంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది. దీనివల్ల మెరుగైన వైద్యం కోసం నకిలీ డాక్టర్లపై ఆధారపడే అవసరం ఉండదు. శాస్త్రీయంగా, కచ్చితంగా జరిగే రోగ నిర్ధారణ పరీక్షల వల్ల రోగం ఏంటో తెలుసుకోవడంతో పాటు ఆసుపత్రుల్లో ఉండాల్సిన అవసరం తగ్గుతుంది. వీటితో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల జిల్లా ఆసుపత్రులపై ఒత్తిడి, పని భారంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని కొనసాగిస్తారని తెలుస్తోంది. దీని వల్ల నిరుపేదలకు సైతం మంచి మెరుగైన వైద్యం అందుతుంది.

# ధర్నాచౌక్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సత్యాగ్రహ నిరాహార దీక్ష

-ప్రధాని మోడీ పరిపాలన బ్లాక్‌డేగా గుర్తించాలి

-ప్రధాని మోడీ రాజీనామా చేయాలి

గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్

విజయవాడ :ప్రస్తుతం బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిరదని, మహాత్మా గాంధీ కలలు కన్న స్వరాజ్యం భారతదేశంలో రావాలని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం గాంధీనగర్‌లోని ధర్నాచౌక్‌లో గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ సత్యాగ్రహ నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ బ్రతికితే దేశం కోసం, చస్తే దేశం కోసం అనే నినాదంతో తాను ఉద్యమ బాట నడుస్తున్నానన్నారు. ప్రధాని మోడీ పరిపాలనను బ్లాక్‌డేగా గుర్తించాలని, ప్రధాని మోడీ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే రాజీనామా చేయాలన్నారు. మతాలకు అతీతంగా ఐకమత్యంగా జీవించాలి. అలాంటి ప్రజా నాయకుడు మనకు కావాలి...రావాలి...అందుకే ఈ నిరసన దీక్ష అని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు వున్ననాడే మనరాష్ట్రం, భారతదేశం అభివృద్ధిచెందుతాయని, మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు పాలకులు నిస్వార్థంగా పనిచేయాలని కోరారు. ఓటును నోటుకు అమ్ముకునే సంస్కృతిని విడనాడి. ఓటు అనే బ్రహ్మాస్త్రంతో మంచి నాయకుడిని ఎన్నుకుందామన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని ప్రధాని మోడీ, బిజెపి పాలకులు ఎంతో అప్రజాస్వామ్యంగా తొలగించారన్నారు. ఈ సత్యాగ్రహ నిరాహార దీక్షకు అన్ని పార్టీల వారిని ఆహ్వానించామని కాంగ్రెస్, సీపీఐ, తదితర పార్టీల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు రాజకీయాలకు అతీతంగా వచ్చి తమ సంఫీ?భావాన్ని తెలిపారన్నారు. వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. వెంటనే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని గాంధీ నాగరాజన్ డిమాండ్ చేశారు. గతంలో ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీని సైతం ఆయన తప్పు పట్టారు. ఇదే తరహాలో ప్రస్తుతం ప్రధాని మోడీ పాలనలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందని విమర్శించారు. ప్రధాని మోడీ విధానాలు ఆదానికి లబ్ధి చేకూర్చేలా ఉన్నాయి గాని భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సమాధానం రాబోయే ఎన్నికలలో తెలియజేస్తారని అన్నారు. నాయీ ప్రశ్నించే గళం వల్ల నాకేదో సంకెళ్ళు పడతాయని భయపడో, చిప్పకూడుకు భయపడే వ్యక్తులు కాదు గాంధేయ వాదులన్నారు. ఇప్పుడు ప్రజలు మేల్కొనాలని ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణని కాపాడుకోవాలని, మన భవిష్యత్తు తరాల కోసం అయినా అందరూ నడుం కట్టాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని తిరిగి ఇచ్చేవరకు తన నిరసన గళాన్ని వివిధ రూపాల్లో తెలియజేస్తానని ఇప్పటికైనా మోడీ తన తప్పు తెలుసుకుని సరిదిద్దుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, పిసిసి కార్య నిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, తదితర పార్టీల నాయకులు శిబిరానికి హాజరై తమ సంఫీ?భావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ ట్రస్ట్ మహిళా అధ్యక్షురాలు ఆర్.ఎన్. శివరంజని, ట్రస్టు రాష్ట్ర అధ్యక్షురాలు బాపతి భారతి తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం సత్వరం పూర్తి చేయాలి



## నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి
## పోలవరం కోసం టిడిపి మద్దతు ఉంటుంది: దేవినేని

విజయవాడ,ఏప్రిల్5 : పోలవరం కోసం ఎంతోమంది తమ భూములను త్యాగం చేశారని, నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు. పోలవరం పూర్తి చేయాలని.. నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఎటువంటి కార్యక్రమం చేపట్టినా టీడీపీ మద్దతు ఉంటుందని దేవినేని ఉమ స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తాను వెళ్లిన సమయంలో అక్కడ ప్రజలు ధర్నా చేస్తున్నారని, వాళ్ల ఇబ్బందులు తెలుసుకుని వారికి డబ్బులు ఇచ్చామన్నారు. రెండోసారి కూడా చంద్రబాబు రూ. 130 కోట్లు ఇచ్చారని, వారికి పక్కా ఇళ్లు కట్టించేలా చర్యలు చేపట్టామన్నారు. డయా ఫ్రం వాల్ కోసం 300 అడుగులు కిందకి వెళ్లామని తెలిపారు.ముంపు గ్రామాల ప్రజల సహకారం వల్లే తాము పురోగతి సాధించామని దేవినేని ఉమ అన్నారు. దేశంలో16 జాతీయ ప్రాజెక్టులు కేంద్రం పరిధిలో జరుగుతున్నాయని, పోలవరం స్థాయిలో ఏ ప్రాజెక్టు పనులు జరగలేదన్నారు. 13వేల 260 కోట్ల రూపాయలు పోలవరం కోసం చంద్రబాబు తెచ్చారని,చేసిన పనులకు డబ్బులు ఇవ్వమంటే ఇరిగేషన్ కాంపోనెంట్ అనే పదం ప్రస్తావించారన్నారు. మూడు వేలకోట్లు వెనక్కి ఇవ్వడానికి లక్ష డాక్యుమెంట్లు అడిగారని, ఆనాడు పది అంతస్తులు ఎక్కి ఆ మొత్తం ఇచ్చామని చెప్పారు. అన్నీ పరిశీలించిన తర్వాత కేంద్ర జల వనరుల శాఖ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ. 55,540 కోట్లకు ఆమోదం తెలిపిందన్నారు. ఆ తరువాత ఎన్నికలు రావడం, జగన్ సీఎం కావడం జరిగిందని, పోలవరం ప్రాజెక్టును పరిశీలించి అంతా ఓకే అని చెప్పిన ముఖ్యమంత్రి.. తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి పనులు క్యాన్సిల్ అని ప్రకటించారని దేవినేని ఉమ విమర్శించారు. నిపుణులు ఎంత నచ్చ చెప్పినా సైకో సీఎం చెవికి ఎక్కలేదన్నారు. ఎనిమిది వందల కోట్ల ఆదా అని చెప్పి.. ఇప్పటి వరకు రూ. 1600 కోట్లు కట్టారన్నారు. చంద్రబాబు, దేవినేని ఉమ దోచేశారని వారి అవినీతి పత్రికలో రాసుకున్నారని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం పోలవరం కట్టారని, ఎటువంటి అవినీతి జరగలేదని కేంద్రమే చెప్పిందన్నారు. జరుతున్న పనులను నిర్దాక్షిణ్యంగా ఆపేసి కాంట్రాక్టు కంపెనీలను పంపేశారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, పోలవరం నిర్వాసితులను ఆదుకునేది చంద్రబాబేనని దేవినేని ఉమ స్పష్టం చేశారు. వైసీపీ స్వార్థం కోసం నిర్వాసితులకు అన్యాయం చేస్తారా? అని ప్రశ్నించారు. బాబాయి వివేక హత్య కేసు నుంచి తప్పుకోవడానికి జగన్ కేంద్రాన్ని నిలదీయ లేక పోతున్నారని.. ఈ దద్దమ్మ, అసమర్థ ప్రభుత్వం వల్ల రైతులు, నిర్వాసితులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# జగ్జీవన్ రామ్ జయంతికి సీఎం జగన్, ఇతరుల నివాళి



గుంటూరు: నేడు స్వాతంత్ర్యోద్యమ నేత, సంస్కరణవాది బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు.సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్. జవహర్ రెడ్డి, అధికారులు హాజరయ్యారు.

## చంద్రగిరి శ్రీ కోదండరామస్వామికి పట్టు వస్త్రాల సమర్పించిన మోహిత్ రెడ్డి

తిరుపతి తుమ్మలగుంట, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి. చంద్రగిరి శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవంకు పట్టు వస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వేడుకగా జరిగిన శ్రీ సీతా రాముల కళ్యాణం పరవశించిన భక్తజనం శ్రీ రామ నామ స్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం. చంద్రగిరిలో కొలువుదీరిన శ్రీ కోదండ రామస్వామి కల్యాణోత్సవం సందర్భంగా వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. బుధవారం తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి చేరుకున్న మోహిత్ రెడ్డికి టీటీడీ ఏఈవో పార్థసారథి ఘనంగా స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసిన మోహిత్ రెడ్డి ఆలయ అర్చకులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం కళ్యాణ మహోత్సవం వద్దకు చేరుకొన్నారు. పట్టు వస్త్రాలు స్వీకరించిన వేద పండితులు మోహిత్ రెడ్డిని ఆశీర్వదించారు. సీతా సమేత శ్రీ కోదండ రామస్వామి కల్యాణం కమనీయంగా సాగింది.

# కాకినాడలో ఆసరా సంబరాలు

కాకినాడ ఆంధ్రప్రదేశ్‌లోని స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, సాధించిన విజయాలు, ప్రగతి దేశ విదేశాల్లో గుర్తింపు తెచ్చిందని కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాద్ పేర్కొన్నారు. ఇందుకు దివంగత నేత వైఎస్సార్, ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కారణమన్నారు. స్థానిక గాంధీనగర్ పార్కు సమీపంలో వైఎస్సార్ ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ తదితరులు కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ ప్రతీ మహిళా ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వాక్రా సంఘాల పరపతిని దిగజారిస్తే, అగ్రస్థానంలో నిలిపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతల్లో రుణాలు రద్దు చేస్తామన్న సీఎం జగన్ ఇప్పటి వరకు ఒక్క కాకినాడలోనే రూ.75 కోట్లు లబ్ధి చేకూర్చారన్నారు. కేవలం ఆసరా పథకమే కాకుండా కాకినాడ సిటీలో 33 వేల మంది మహిళ పేరుతో ఇళ్ళ పట్టాలు, ఇతర ప్రభుత్వ పథకాలను కూడా వర్తింప చేశారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్ మాట్లాడుతూ ప్రతీ మహిళా లక్షాధికారి కావాలని వైఎస్సార్ ఆశిస్తే తనయుడు సీఎం జగన్ అమలు చేసి చూపిస్తున్నారన్నారు.

# సంపాదకీయం

**గురువారం 06-04-2023**

## ఇక మరింత పెరగనున్న ద్రవ్యోల్బణం

పెట్రోల్, డీజెల్ రేట్లు దిగివచ్చే అవకాశాలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ముడి చమురు ఉత్పత్తి ఎగుమతి దేశాలు భారీ బాంబ్ పేల్చాయి. సౌదీ అరేబియా సహా ఒపెక్ ప్లస్ దేశాలు ముడి చమురు ఉత్పత్తిలో రోజుకు 11.6 లక్షల బ్యారెళ్ల తగ్గింపును ప్రకటించి అంతర్జాతీయ సమాజానికి షాక్ ఇచ్చాయి. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న భారత్ సహా అన్ని అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాలకు ఇది గట్టి శరాఘాతంగా చెప్పుకోవాలి. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం మరింత బలపడుతుంది, ఆర్థిక వ్యవస్థ ఇంకా బలహీనపడుతుంది.ాఖఇఅ+ కూటమిలో కీలక దేశాలైన సౌదీ అరేబియా, రష్యా కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఏడాది మే నుంచి డిసెంబరు చివరి వరకు, రోజువారీ ముడి చమురు ఉత్పత్తిని 5 లక్షల బ్యారెళ్ల మేర తగ్గిస్తామని సౌదీ అరేబియా నాడు ప్రకటించింది. 2023 చివరి వరకు, రోజుకు 2 మిలియన్ (20 లక్షలు) బ్యారెళ్ల కోతను ఒపెక్ దేశాలు గత అక్టోబర్ నుంచే అమలు చేస్తున్నాయి. ప్రస్తుత కోతలు దీనికి అదనంగా జత కలవనున్నాయి.ప్రపంచ బ్యాంకింగ్ సంక్షోభం వల్ల చమురు డిమాండ్ తగ్గుతుందన్న ఆందోళనతో, ముడి చమురు ధరలు గత నెలలో బ్యారెల్‌కు 70 డాలర్లకు పడిపోయాయి, 15 నెలల కనిష్ట స్థాయికి చేరాయి. అయితే, బ్యాంకింగ్ సంక్షోభం సద్దుమణిగి బ్యారెల్ ముడి చమురు ధర మళ్లీ 70 డాలర్లకు చేరుకుంది. చమురు ధర కోలుకున్నా ఒపెక్ దేశాలు తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ దేశాలకు ఆశ్చర్యం కలిగించింది. ఎవరూ ఊహించని నిర్ణయం ఇది.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఇటీవలి కాలంలో అత్యంత అస్థిరంగా కదులుతున్నాయి. ధరలను శాంతిపజేసి, స్థిరంగా ఉంచేందుకు ముడి చమురు ఉత్పత్తి దేశాలు సప్లైని తగ్గిస్తున్నాయి. సరఫరాను తగ్గిస్తే ధరలు పెరిగి ఒక స్థాయిలో స్థిరపడతాయన్నది ఒపెక్ ప్లస్ అంచనాదేశ జనాభాలో 27.5 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన పడరాని పాట్లు పడుతున్నారు. అంటే 38 కోట్ల మంది నిరుపేదరికంలో మగ్గుతున్నారు. రవాణా ఛార్జీలను పెంచి వేస్తున్న అధిక ఇంధన ధరలు వీరి జీవితాలతో ఆడుకొంటున్నాయి. దేశంలో ప్రజలకు 90% పెట్రోల్, డీజెల్ సరఫరా చేసే పబ్లిక్ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్తాన్ పెట్రోలియం సంస్థలు అతి తక్కువ కిమ్మత్తు రష్యన్ ఆయిల్ మాత్రమే దిగుమతి చేసుకోగలుగుతున్నాయి.ఇదేమి చిత్రమని అడిగితే రష్యన్ ఆయిల్‌తో లాభపడుతున్న ప్రైవేటు కంపెనీల నుంచి అదనపు పన్నును వసూలు చేస్తున్నామని కేంద్రం చెబుతున్నది. పన్ను ఆదాయం కక్కుర్తితో ప్రజలను అధిక ఇంధన ధరల మంటల్లో మలమలమాడ్చుడం ఏ రకమైన ప్రజా సేవ అని కేంద్రాన్ని నిలదీయవలసి వుంది. దీనిని బట్టి చూసినప్పుడు పబ్లిక్ రంగ చమురు సంస్థల పాత బకాయిలు తీర్చుడం కోసం ప్రజల నుంచి అధిక ధరలను వసూలు చేయక తప్పడం లేదని గతంలో చెప్పిన కారణం బూటకమేనని స్పష్టపడుతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలను బట్టి దేశంలో డీజెల్, పెట్రోల్ ధరలను ఎప్పటికప్పుడు సవరించాలనే విధానాన్ని చేపట్టిన కేంద్రం 2022 మే నెల నుంచి వీటి ధరల్లో ఎటువంటి మార్పు తీసుకు రాలేదు. అప్పుడు మాత్రం పెట్రోల్‌పై లీటరు వద్ద రూ. 8, డీజెల్‌పై రూ. 6 తగ్గించారు. ఆ తర్వాత ఆ ఊసే లేదు.ఇప్పటికి 11 మాసాలుగా మండు వేసవి మాదిరిగా ప్రజల నెత్తిన నాట్యం చేస్తున్న ఈ ధరలు ఇప్పట్లో తగ్గే సూచనలైతే లేవు.అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర బ్యారెల్ 77 డాలర్లుగా వుంది. ఇది వాస్తవానికి అధిక ధర కాదు. గతంలో 100 డాలర్లు దాటిపోయిన సందర్భాలున్నాయి. పైపెచ్చు ప్రపంచంలోని అనేక దేశాలకు లేని ఒక గొప్ప సౌకర్యాన్ని భారత దేశం అనుభవిస్తున్నది. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన 2022 ఫిబ్రవరి నుంచి రష్యా నుంచి చవకగా క్రూడాయిల్‌ను కొనుగోలు చేసే అవకాశం మనకు కలిగింది. రష్యాకు గుణపాఠం చెప్పి తమ దారికి రప్పించుకోడానికి అమెరికా, యూరపు దేశాలు అక్కడి నుంచి కొనుగోలు చేసే క్రూడాయిల్ ధరను బ్యారెల్ 60 డాలర్ల వద్ద స్తంభింప చేశాయి. అలాగే రష్యన్ ఆయిల్‌ను ఇతర దేశాలకు తీసుకుపోయే నౌకలు అందుబాటులో లేకుండా చేశాయి. నౌకలకు బీమా సౌకర్యం లభించకుండా అడ్డుకొన్నాయి.రష్యా ఆదాయంలో సగం ఆయిల్ మీదనే వస్తుంది. ఆయిల్ ఎగుమతులు చేయకపోతే దానికి ప్రాణం ఆడదు. అందుచేత చవకగానైనా చైనా, ఇండియా వంటి దేశాలకు రష్యా తన ఆయిల్‌ను విక్రయిస్తున్నది. యుద్ధానికి ముందు రష్యా నుంచి అతి తక్కువ కిమ్మత్తు ఆయిల్‌ను కొనుగోలు చేసిన ఇండియా ఆ తర్వాత భారీ మొత్తంలో దిగుమతి చేసుకోడం ప్రారంభించింది. అంతకు ముందరి కంటే పది, పదిహేను రెట్లు ఎక్కువగా రష్యన్ ఆయిల్‌ను భారత్ దిగుమతి చేసుకొంటున్నట్టు సమాచారం. 2022 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు గల ఏడు మాసాల్లోనే రష్యన్ ఆయిల్ కోసం ఇండియా 20 బిలియన్ డాలర్లు చెల్లించింది. రిలయెన్స్ తాను కొనుగోలు చేస్తున్న మొత్తం ఆయిల్‌లో మూడింట ఒక వంతు రష్యా నుంచి పొందుతున్నది. రష్యా నుంచి నేరుగా ఆయిల్ కొనుగోలును బంద్ చేసిన యూరపు దేశాలు దొడ్డి దారిలో ఇలా దానిని కొనుగోలు చేస్తుండడం గమనించవలసిన విషయం.

# కర్నూలు పార్టీల్లో ఇంటి పోరు

కర్నూలు, ఏప్రిల్ 5,పార్టీ ఆవిర్భావం నుంచి దాదాపు 30 ఏళ్ల పాటు నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదిగిన తెలుగుదేశం పార్టీ నేడు అధిష్టానం అనాలోచిత నిర్ణయాలతో గెలుపు పిలుపునకు దూరమైంది. పార్టీలో రెండు వర్గాలుగా చీలడంతో పార్టీ తీరని నష్టాన్ని చవి చూస్తోంది. మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన కుటుంబాన్ని కాదని అప్పటికప్పుడు పార్టీలో చేరిన వారికి టికెట్ ఇవ్వడంతో మరో వర్గం నేతలకు మింగుడు పడడంలేదు. కనీసం ఈ సారైనా తమను గుర్తించి సీటిస్తే గెలుపును చంద్రబాబుకు గిఫ్టుగా ఇస్తామని మరో వర్గం నాయకులు అంటున్నారు. అంతిమంగా టీడీపీలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, నియోజకవర్గ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరిల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరిందనడంలో సందేహం లేదు. వీటిని చక్కబెట్టి పార్టీ గెలుపునకు కృషి చేస్తారా ? లేక ఎప్పటిలాగే నిర్ణయించి అధికార పార్టీ చేతిలో చిత్తుగా ఓడిపోతారా ? అన్నది ప్రశ్నగా మారింది. అధికార వైసీపీలో కూడా అదే పరిస్థితి నెలకొంది.కర్నూలు జిల్లాలో ఆలూరు నియోజకవర్గంలో అటు అధికార వైసీపీ, ఇటు టీడీపీలో వర్గ పోరు నడుస్తోంది. ప్రధానంగా 30 ఏళ్లుగా ఈ నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా ఉండేది. అలాంటిది వైసీపీకి సానుభూతి కలిసొచ్చింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పై ఉన్న అభిమానంతో ఆయన తనయుడికి ఒక ఛాన్స్ ఇద్దామని ఓటర్లు నిర్ణయించుకుని గెలుపును అందించారు. ఎక్కడ లోపం జరిగిందని ఆలోచించాల్సిన టీడీపీ ఎన్నికల సమయంలో పార్టీ మారిన వారికి టికెట్ ఇచ్చి ఓటమిపాలైంది. టీడీపీలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, నియోజకవర్గ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరిల మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరింది. ఎవరికి వారు కార్యక్రమాలు చేస్తుండడం కార్యకర్తలకు వీరి తీరు తలనొప్పిగా మారింది. నాయకుల మధ్య విభేదాల కారణంగా ప్రతిసారి ఏదో రూపంలో ఆలూరు టికెట్ కష్టపడ్డ వారికి కాకుండా ఇతరులకివ్వడం, అభ్యర్థులు పరాజయం చెందడం పరాపాటిగా మారింది. నేతల మధ్య ఉన్న విభేదాలు కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అందరూ కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థులను గెలిపించాలని పదేపదే చెబుతున్నా స్థానిక నేతల చెవులకు ఎక్కడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి 2024లో టీడీపీ తరఫున టికెట్ ప్రస్తుత ఇంచార్జి కోట్ల సుజాతమ్మకా? లేక నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉన్న వైకుంఠం మల్లికార్జునకా ? అనే చర్చ సాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే ఆలూరు నుంచి పోటీ చేసే టీడీపీ అభ్యర్థి గెలుపు చాలా సులభతరమౌతుందని రాజకీయ విశ్లేషకులు, సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.పార్టీ ఆవిర్భావం నుంచి ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నేత, దివంగత కర్నూలు కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు సారథ్యంలో దాదాపు 30 ఏళ్లగా టీడీపీ తిరుగులేని శక్తిగా వెలుగొందింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక శాతం టీడీపీ అభ్యర్థులను ఏకగ్రీవంగా చేసిన ఘనత వైకుంఠం శ్రీరాములకే దక్కింది. వైకుంఠం శ్రీరాములు పార్టీకి అందించిన సేవలను గుర్తించి అప్పట్లో జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నామినేటెడ్ పోస్ట్ కేటాయించారు. అయితే ఆయన ఎదుగుదల చూసి ఓర్వలేని కొంతమంది రాజకీయ ప్రత్యర్థులు వేసిన ఎత్తగడలో 2006 నవంబర్ 18న చిప్పగిరిలో తమ నివాసంలో దంపతులిద్దరూ దారుణ హత్యకు గురయ్యారు. వైకుంఠం శ్రీరాములు హత్యోదనంతరం ఆయన కుమారులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, వైకుంఠం శివప్రసాద్ లు పార్టీ పగ్గాలు చేపట్టారు. అయితే పార్టీ కోసం తమ తల్లిదండ్రులను కోల్పోయి పార్టీ పటిష్టత కోసం విశేష సేవలందించినా అధిష్టానం వీరికి కాకుండా 2004 లో టికెట్ మసాల పద్మజకు ఇచ్చారు. అలాగే 2009 లో పొత్తులలో భాగంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు, 2014 ఎన్నికల్లో మాజీ టీడీపీ ఇంచార్జి వీరభద్ర గౌడ్ కు ఇచ్చారు. అయితే 2019 లోనైనా తమకు సీటు ఇస్తారనే ఆశ ఉండేది. ఎన్నికల చివరి నిమిషంలో పార్టీలో చేరిన కోట్ల సుజాతమ్మకు సీటు ఇచ్చి మరోమారు మొండిచేయి చూపారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనే వైకుంఠం శ్రీరాములు కుటుంబానికి ఓ బలమైన వర్గం, క్యాడర్ ఉన్నప్పటికీ వారికి టికెట్ విషయంలో అధిష్టానం వారికి సీటు ఇవ్వకపోవడంతో చాలా నిరాశకు లోనయ్యారు.మొదటి నుంచీ పార్టీ కోసం పని చేసిన వీరి కుటుంబం వైకుంఠం అంటేనే టీడీపీ అనే బ్రాండ్ ఉంది. అందు వల్ల వీరు ఏనాడు కూడా వేరే పార్టీలో చేరాలనే ఆలోచన చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం పని చేసుకుంటూ కార్యకర్తలకు అండగా ఉంటూ వస్తున్నారు. రానున్న 2024 లో జరిగే ఎన్నికల్లో నైనా తమ కుటుంబానికి సీటు కేటాయిస్తే గెలిచి తీరుతామని వైకుంఠం మల్లికార్జున చౌదరి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుత టీడీపీ ఇంచార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఇతర నేతలను, కార్యకర్తలను కలుపుకొనిపోకుండా ఒంటెద్దు పోకడ రాజకీయాలు చేస్తున్నారని సొంత పార్టీ నేతలు, కార్యకర్తలు బహిరంగ విమర్శలు చేయడ గమనార్హం. అంతిమంగా అధిష్టానం టీడీపీ సీటు కోట్ల సుజాతమ్మకిస్తారా ? లేక చాలా సార్లు ఆశించి భంగపాటుకు గురౌతోన్న వైకుంఠం మల్లికార్జున చౌదరి కుటుంబానికిస్తారా అనేది సందేహంగా మారింది.అధికార వైసీపీలో ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మనూరు జయరాం మంత్రిగా కొనసాగుతున్నారు. ఈయన అనుచరులు సొంత పార్టీలో వర్గ విభేదాలు సృష్టించారు. మంత్రి భిక్షం వేయడంతోనే జెడ్పీటీసీ పదవి వచ్చిందని చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి పట్ల వ్యాఖ్యలు చేశారు. దీంతో పార్టీ కోసం పని చేస్తున్న జెడ్పీటీసీ తాను వైఎస్ఆర్ అభిమానినని, వైసీపీ అధినేత జగన్ కోసం పని చేస్తా తప్ప మంత్రి భిక్ష తనకు వద్దంటూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అధిష్టానం కలుగజేసుకుని నచ్చజెప్పింది. అప్పటి నుంచి నేటి వరకు కూడా వైసీపీలో ఎవరికి వారుగా కార్యక్రమాలు చేసుకుంటూపోతున్నారు. అయితే మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడి కారణంగా మంత్రి పట్ల నియోజకర్గంలో చాలా వ్యతిరేకత నెలకొంది. ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లింది. దీంతో అధిష్టానం మంత్రికి రానున్న ఎన్నికల్లో కర్నూలు ఎంపీ టికెట్ ఇచ్చి ఆయన తమ్ముడికి టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో తనకూ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి అధిష్టానానికి విన్నవించినట్లు సమాచారం.

# ఏపీలో ప్రారంభమైన మైండ్ గేమ్

విజయవాడ, ఏప్రిల్ 5, ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది టైం ఉంది. అయినప్పటికీ పొలిటికల్ ఉక్కపోత రోజురోజుకు పెరిగిపోతుంది. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయా రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. తొలుత ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం చుట్టాయి. అనంతరం అభివృద్ధి పేరుతో అనుబంధంగా నేతలు రాజకీయ పార్టీలు మార్చేశారు. మరికొందరు తమను పక్కన పెట్టేశారంటూ వేరే పార్టీకి జంప్ అయ్యారు. ఈ చర్యలతో ఎన్నికల వేడి రాజుకుంటుంది. ఇలాంటి తరుణంలో తాజాగా మైండ్ గేమ్ పాలిటిక్స్‌లో నేతలు బిజీబిజీ అయ్యారు. పార్టీని, పార్టీలోని కార్యకర్తల్లో నిరుత్సాహానికి గురి చేసేందుకు వారిలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తు?న్నారు. పట్టభద్రులు, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించిన సంగతి తెలిసిందే. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు టీడీపీకి ఓటు వేయడం అందులో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలు సస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. దీనికంతటికీ చంద్రబాబు మైండ్ గేమ్ పాలిటిక్సేనని వైసీపీ ఆరోపిస్తోంది. అంతేకాదు ఆ నలుగురు ఎమ్మెల్యేలే కాదు 18 మంది తమతో టచ్‌లోఉన్నారని ఓ మాజీ ఎమ్మెల్యే, కాదు కాదు 32 మంది టచ్‌లో ఉన్నారని ఇంకో టీడీపీ నేత ప్రకటనలు చేస్తూ వైసీపీలో గందరగోళానికి గురి చేస్తున్నారు. తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం తమతో వైసీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ కుండబద్దలు కొట్టారు. అటు వైసీపీ సైతం కౌంటర్ ఇస్తోంది. వేం గేట్లు ఎత్తితే టీడీపీలో మిగిలేది ఇద్దరేనంటూ చెప్పుకొస్తోంది.ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు టీడీపీలో జోష్ నింపితే.. వైసీపీలో నిరాశ నిస్పృహలు తెచ్చిపెట్టాయి. ఇదే సందర్భంలో టీడీపీ దూకుడు పెంచితే.. వైసీపీ అధిష్టానం పార్టీపై ప్రత్యేకమైన దృష్టి సారించింది. అటు పార్టీ ఇటు ప్రభుత్వంలోనూ ప్రక్షాళన దిశగా వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు మైండ్‌గేమ్ పాలిటిక్స్‌లో వైసీపీ ఇరుక్కుందనే ప్రచారం ఉంది. ఆ మైండ్ గేమ్ పాలిటిక్స్ నుంచి ఎలా బయటపడాలనేదానిపై వైసీపీ దృష్టి సారించేలోపే టీడీపీ వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేసేలా ప్రకటనలు చేస్తోంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలే టీడీపీకి టచ్‌లోకి వచ్చారని తేలిందని కానీ తమతో 18 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు మరచిపోకముందే వైసీపీ నుంచి 40 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ అటు అచ్చెన్నాయుడు చెప్పుకొచ్చారు. తాజాగా చంద్రబాబు నాయుడు సైతం వైసీపీ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఎన్నికలు వస్తే వారంతా తమ పార్టీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ బాంబు పేల్చారు.తెలుగుదేశం పార్టీ నేతలు చేస్తున్న మైండ్ గేమ్ పాలిటిక్స్ వైసీపీలో టెన్షన్ రేపుతున్నాయి. టీడీపీతో టచ్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలు ఎవరు అంటూ పార్టీలో చర్చ జరుగుతుందట. అటు వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను అలర్ట్ చేసినట్లు తెలుస్తోంది. అసలు టీడీపీలోకి వెళ్లాల్సిన ఎమ్మెల్యేలు ఎంతమంది ఉన్నారు.. వారు టీడీపీతో కలవడానికి గల కారణాలు.. ఎక్కడ అసంతృప్తి వచ్చింది అనే అంశాలపై కూలంకుషంగా ఆరా తీసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అలాగే ప్రతీ ఎమ్మెల్యే, కీలక నేతలపై నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. అంతేకాదు పార్టీలోని అసమ్మతి, ఆధిపత్యపోరు వంటి అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి వాటిని సరిదిద్దాలని పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, ఇన్‌చార్జి మంత్రులకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే టీడీపీ ఆడుతున్న మైండ్ గేమ్ పాలిటిక్స్‌కు మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. టీడీపీతో టచ్‌లో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు ఎవరో చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ దారుణంగా ఓడిపోతుందని కనీసం చంద్రబాబు కూడా గెలవరేమోనని సందేహం వ్యక్తం చేశారు. అలాంటి టీడీపీలోకి వైసీపీ ఎమ్మెల్యేలు ఎందుకు వెళ్తారని ప్రశ్నించారు. వైసీపీ తలుపులు తెరిస్తే టీడీపీలో చంద్రబాబు, అచ్చెన్నాయుడు తప్ప ఎవరూ మిగలరు అంటూ బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తుంటే ఎల్లో మీడియాకు కడుపు మండుతోందని ఆరోపించారు. వైసీపీ గేట్లు ఎత్తితే టీడీపీలో ఉండేది ఆ అధ్యక్షులు ఇద్దరు మాత్రమేనని చెప్పుకొచ్చారు. 40 మంది వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలోకి టచ్‌లో ఉంటే ఇద్దరు ఎమ్మెల్యేలను ఎందుకు కొనుగోలు చేసినట్లు అని బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. మె?త్తానికి ఈ మైండ్ గేమ్ పాలిటిక్స్ ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో వేచి చూడాలి.

# వడ్డీ కాసుల వాడికి కాసుల పంట

తిరుమల, ఏప్రిల్ 5, కలియుగ వైకుంఠం.. భక్తికి మోక్షానికి మార్గంగా నమ్ముతారు హిందువులు. అందుకే ఎన్నో పురాణాల్లో ఈ కలియుగంలో శేషాద్రిని మించిన పర్వతం లేదని భావిస్తారు. వేంకటేశ్వరునికి సమమైన దైవం లేదని మహా మునులు, ఋషులు కీర్తించారు. అందుకే శ్రీ శ్రీనివాసుని దర్శనార్థం నిత్యం వేల సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకుంటారు. అందుకే తిరుమల పుణ్య క్షేత్రం నిత్యం భక్త జన సందోహంతో కిటకిటలాడుతూ ఉంటుంది. శ్రీవారి దర్శనార్థం కిలోమీటర్ల వరకు భక్తులు వేచి ఉండే పరిస్థితి నిత్యం కనిపిస్తూనే ఉంది. తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీవారి హుండీ ఆదాయం సైతం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది మార్చి మాసం నుండి హుండీ ఆదాయం గణనీయంగా పెరుగుతు వచ్చింది. ఆర్థికశాఖ అధికారుల అంచనాలను మించి వార్షిక హుండీఆదాయం లభిస్తోంది.శ్రీవారి హుండీ ఆదాయం కనివిని ఎరుగని రీతిలో పూర్వపు రికార్డులను బ్రేక్ చేస్తూ కొత్త రికార్డులను నమోదు చేస్తోంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గతేడాది ఆగస్టు మాసంలో హుండీ ఆదాయం 140 కోట్ల మార్కును అందుకుంది. కరోనా తరువాత స్వామి వారి హుండీ ఆదాయం పెరుగుతూ వస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది హుండీ ఆదాయం గరిష్ట స్థాయికి చేరుకుంది.తాజాగా మార్చి నెలలోకూడా వరుసగా భారీగా ఆదాయం సమకూరింది. గతేడాది కాలం నుంచి స్వామివారి హుండీ ఆదాయం ప్రతీనెల 100కోట్లకుపైగానే సమకూరుతూ వస్తోంది. ఈ క్రమంలో మార్చి నెలలో తిరుమల హుండీ ఆదాయం 120.29 రూపాయల కోట్లు లభించింది. మార్చినెలతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. దీంతో 2022-23 ఆర్థిక సంవత్సరంకుగాను తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ ఆదాయం 1,520.29 కోట్ల రూపాయలు లభించిందని టీటీడీ అధికారులు తెలిపారు. భక్తుల తాకిడి భారీగా పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో భారీగా నగదు, ఇతర విలువైన వస్తువులను స్వామివారికి సమర్పిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతీ నెలాస్వామివారి ఆదాయం పెరుగుతూ వస్తోంది.2022 సంవత్సరంలో అంటే జనవరి నెల నుంచి డిసెంబర్ నెల వరకు 2.37 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

# వార్నింగ్ కు కాదు భరోసా

విజయవాడ, ఏప్రిల్ 5, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో వైసీపీ నాయకత్వంలో మార్పు వచ్చింది. ఆ పరిణామం తరువాత జరిగిన పార్టీ సమావేశంలో పార్టీ అధినేత జగన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు వరకు ఎమ్మెల్యేల పనితీరును గుర్తు చేస్తూ వారిని హెచ్చరిస్తూ వచ్చారు సీఎం జగన్. ఈ క్రమంలో పలువురు ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్లు ఇచ్చే అవకాశం కూడా లేదని చెప్పారని.. ఆ జాబితాలో ఉండవల్లి శ్రీదేవి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కూడా ఉన్నారని వార్తలు వచ్చాయి. ఈ కారణంగా ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్టు రాజకీయవర్గాల్లో ప్రచారం సాగింది. మరోసారి టికెట్ రాదనే నిరాశలో ఉన్న ఈ ఇద్దరిని టీడీపీ నాయకత్వం సులభంగా తమవైపు ఆకర్షించిందని వైసీపీ నాయకత్వం ఓ అంచనాకు వచ్చినట్టు సమాచారం. ఈ ఇద్దరి ఎపిసోడ్ తరువాత సీఎం జగన్ తీరు మారిందని.. అదే సమావేశంలో తేలిపోయిందని కొందరు చర్చించుకుంటున్నారు.ఈ సమావేశంలో ఒక్క ఎమ్మెల్యేనూ వదలుకోమని, అందర్నీ గెలిపించుకుటామని సీఎం జగన్ అన్నారు. కానీ, ఎమ్మెల్యేలంతా క్రియాశీలకంగా ఉండాలని, సోషల్ మీడియాను బాగా ఉపయోగించుకోవాలని సూచించారు. గడప గడపకు త్వరగా పూర్తి చేయాలని, నెలకు 25రోజులు సచివాలయాల్లో తిరగాలని, సెప్టెంబరు నుంచి కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సీఎం జగన్ ఉద్ఘాటించారు.ఏ ఒక్క ఎమ్మెల్యేను పోగొట్టుకోనని, అందరితో పనిచేయించి గెలిపించుకునేందుకే ప్రయత్నాలు చేస్తానని, ఎవరు చేయాల్సిన పని వాళ్లు చేస్తే 175 సీట్లు గెలుస్తామంటూ ఎమ్మెల్యేలకు సీఎం జగన్ భరోసా అందించారు. గతంలో పని చేయని ఎమ్మెల్యేలకు ఎక్కువగా వార్నింగ్‌లు ఇస్తూ వచ్చిన వైఎస్ జగన్.. ఈ సారి వారికి హెచ్చరికలు చేయడానికి బదులుగా భరోసా ఇవ్వడానికే ప్రాధాన్యత ఇచ్చారని అభిప్రాయపడుతున్నారు. కొన్ని రోజుల నుంచి టీడీపీ నేతలు చేస్తున్న ప్రకటనలు కూడా ఇందుకు కారణం కావొచ్చనే టాక్ వినిపిస్తోంది. అనేక మంది వైసీపీ ఎమ్మెల్యే తమతో టచ్‌లో ఉన్నారని టీడీపీ ముఖ్యనేతలు కొందరు కామెంట్స్ చేస్తూ వచ్చారుగ్రీన్ సిగ్నల్ ఇస్తే అనేక మంది తమ పార్టీలోకి వచ్చేందుకు రెడీ ఉన్నారని చెప్పారు. వైసీపీ నాయకత్వం ఎమ్మెల్యేలను హెచ్చరించకుండా భరోసా ఇవ్వడానికి ఇది కూడా ఒక కారణమని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు వైసీపీ నాయకత్వంలో మార్పు రావడానికి కారణమైనట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

# నిమ్మ ధరలు అధరహో

కర్నూలు, ఏప్రిల్ 5,నిమ్మ ధరలు పసిడి ధరలను తలపిస్తున్నాయి. చరిత్రలో ఇప్పటివరకూ రాని ధరలు ఆదివారం పలికాయి. లూజు బస్తా కనిష్టంగా రూ.11 వేల నుంచి గరిష్టంగా రూ.13 వేల వరకూ చేరింది. కిలో రూ.140 నుంచి రూ.160 వరకూ ధర పలికింది. అదేవిధంగా పండ్లకు రూ.110 నుంచి రూ.130 వరకూ రావడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వారంరోజుల నుంచి నిమ్మ మార్కెట్‌లో ఆశించిన మేర ధరలు వస్తుండడంతో రైతులు ఊరట చెందుతున్నారు. ఆపిల్ ధర కన్నా నిమ్మ ధరలే అధికంగా ఉన్నాయంటూ సంతోషంగా చెబుతున్నారుఒక్క రోజులో ఢిల్లీ మార్కెట్‌కు కాయలు తీసుకొచ్చే దూరంలో ఉన్న భావానగర్‌లో, మహారాష్ట్రలోని బీజాపూర్‌లో, మన



రాష్ట్రంలోని రాష్ట్రంలోని తెనాలి, ఏలూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో కాపు లేకపోవడంతోనే ఈ ధరలు నమోదువుతున్నట్లుగా వ్యాపారులు చెబుతున్నారు. అలాగే మన ప్రాంతంలో తీవ్ర వర్షాల కారణంగా ఆలస్యంగా పూత ఆలస్యమైంది. ఇలా అనేక అంశాలు కలిసి రావడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని అంటున్నారు. మూడేళ్లగా ఈ సీజన్‌లో నిమ్మకాయలకు విపరీతమైన ధరలు వస్తుండడంతో రైతులు నష్టాల ఊబి నుంచి బయటపడున్నారు.గూడూరు, పొదలకూరు నిమ్మ మార్కెట్లకు ఢిల్లీ మార్కెట్ గుండెలాంటిదని చెబుతుంటారు. అక్కడ ధరలు బాగా పలుకుతుంటేనే ఇక్కడి నిమ్మ మార్కెట్ కళకళలాడుతుంది. అటు నార్త్ ఢిల్లీ, సౌత్ చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి రెండు రోజులుగా కాయలు కావాలంటూ స్థానిక మార్కెట్లలోని వ్యాపారులను అడుగుతున్నారు. నిమ్మకాయల ధరలు ఇప్పటి వరకూ ఈ స్థాయిలో పలికింది లేదు. నాకు తెలిసే కాకుండా, మా పెద్దల కాలంలో కూడా ఇలా ధరలు రాలేదు. 2009లో లూజు బస్తా గరిష్టంగా రూ.9 వేలు పలికితే అబ్బో అన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు కొన్నాళ్లు నిలబడితే చాలు. నిమ్మ ధరలు ఇప్పటి వరకూ ఇంత పలికిందే లేదు. జగనన్న పాలనలో రైతులే రాజులుగా మారారు. అందుకు నిదర్శనమే నిమ్మకాయల ధరలు ఈ స్థాయికి చేరడం. కాయలుంటే ధరల్లేక, ధరలుంటే కాయల్లేక ఇబ్బందులు పడే నిమ్మరైతుల కష్టాలు తేరినట్లే.. చాలా ఆనందంగా ఉన్నాం.

# చింతపల్లిలో కశ్మీర్ అందాలు

విశాఖపట్టణం, ఏప్రిల్ 5, విశాఖ ఏజెన్సీ చింతపల్లిలో కశ్మీర్, ఊటి అందాలు కనువిందు చేస్తున్నాయి. చింతపల్లి ఏజెన్సీలో ప్రయోగాత్మకంగా చేపట్టిన పూలసాగు..సక్సెస్ ఫుల్‌గా సాగుతోంది. విరబూసిన రంగురంగుల పూలతో ఇక్కడి వ్యవసాయ పరిశోధన కేంద్రం కొత్త సొబగులు అద్దుకుంటోంది. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అమలు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రాజెక్టు ఇప్పుడు విజయవంతంగా సాగుతోంది. స్థానిక రైతులు అధిక ఆదాయం పొందేందుకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టును గతేడాది ప్రారంభించారు. గిరిజన రైతులు అధిక ఆదాయం కోసం వేరే మార్గాలను అనుసరించకుండా.. పూలు, ఇతర పంటల సాగుపై ప్రణాళికలతో ఈ పూల సాగు చేస్తున్నారు.శాస్త్రవేత్తలతో కలిసి ఇక్కడి పరిశోధన కేంద్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా పూల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో వివిధ రకాల పూలమొక్కలు సాగు చేస్తున్నారు. గ్లాడియోలస్, తులిప్, గులాబీలు, జర్బరా, డాలీఫ్లవర్స్ వంటి అనేక రకాల పూల మొక్కలను సాగుచేస్తున్నారు. ఈ పూల సాగును పూర్తిగా ఆర్గానిక్ పద్ధతిలోనే చేపడుతున్నారు. ఇక్కడి గిరిజనులు గంజాయి సాగు వైపు వెళ్లకుండా అధిక ఆదాయం వచ్చే పూలు, ఇతర పంటల సాగువైపు అడుగులు వేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్రకశ్మీర్, లంబసింగి, ఆంధ్ర ఊటీ అరకు పర్యాటక పరంగా దినదినాభివృద్ధి చెందుతుంది. ఈ క్రమంలో ఇక్కడకు పర్యాటకుల తాకిడి పెరిగింది. గిరిజన రైతులు పూలసాగు ద్వారా మార్కెటింగ్ చేస్తూ అధిక ఆదాయాన్ని పొందవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ పూలసాగును పూర్తిగా ఆర్గానిక్ పద్దతిలోనే చేపడుతున్నారు.

# ఏపీలో హాట్ టాపిక్‌గా టీడీపీ-జనసేన పొత్తు

విజయవాడ, ఏప్రిల్ 5, టీడీపీ-జనసేన పొత్తు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్. రెండు పార్టీల అగ్ర నాయకత్వాల నుంచి ఎలాంటి స్పష్టమైన సంకేతాలు రాకున్నా? అలా జరుగుతుందన్నది కింది స్థాయి నేతలు, కేడర్‌లో ఉన్న అభిప్రాయం. ఎవరు ఎన్ని సీట్లల్లో పోటీ చేస్తారు..? ఎక్కడెక్కడ సీట్లు ఎవరికి వస్తాయి లాంటి హర్డిల్స్ రెండు పార్టీల ముందు ఉన్నాయి. ఇలా ఏ విషయంలోనూ క్లారిటీ లేకున్నా? పొత్తు మాత్రం ఖాయమనే ఫీలింగ్ ఆయా వర్గాల్లో వ్యక్తమవుతోంది. బయట ఎన్ని చర్చోప చర్చలు జరుగుతున్నా.. ప్రచారం ఉన్నా.. ఇటు చంద్రబాబుకు.. అటు పవన్ కళ్యాణ్‌కు ఈ విషయంలో పక్కాగా క్లారిటీ ఉందనే భావనలో ఉన్నారు నేతలు. అయినా? అందరికీ ఎక్కడో ఏదో డౌట్. చివరికి ఏదైనా జరగొచ్చన్న అప నమ్మకం. ఎన్నికల్లో పొత్తులపై ఇటు టీడీపీ.. అటు జనసేన పార్టీలు అధికారిక ప్రకటన చేసే దాకా.. రాజకీయాలు ఎలాగైనా టర్న్ కావచ్చునే చర్చ కూడా అదే స్థాయిలోజరుగుతోంది. మరీ ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత పొత్తు మాటలు ఎడతెగకుండా జరుగుతున్నాయి.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన ప్రస్తావన లేకుండానే టీడీపీ గెలిచింది. దీంతో సాధారణ ఎన్నికల్లో కూడా ఇదే వ్యూహంతో వెళ్ళాలన్నది కొందరు తెలుగుదేశం నేతల్లో ఉన్న అభిప్రాయం.టీడీపీ ఇన్నర్ సర్కిల్స్‌లో ఈ చర్చ కాస్త ఎక్కువగానే జరుగుతోందట. అయితే ఈ మాటలను ఎవ్వరూ బహిరంగంగా మాట్లాడటం లేదు? పార్టీ వర్గాల్లో మాత్రం అంతర్గతంగా అదే భావన ఉందట. కానీ సాధారణ ఎన్నికల్లో ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి టీడీపీ అధినాయకత్వం ఇష్టపడడం లేదట. పొత్తుల్లేకుండా టీడీపీ గెలవలేదని, చంద్రబాబు వ్యూహాలు ఫలించవని? ఇలా ఎన్ని విమర్శలు ఎదురైనా అస్సలు పట్టించుకోకూడదని టీడీపీ అధినాయకత్వం భావిస్తోందట. ఎందుకంటే.. చిన్న ఛాన్స్ తీసుకున్నా? ఈసారి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నది పార్టీ పెద్దల మధ్య జరుగుతున్న ఇన్నర్ టాక్. దీంతో జనసేన అవసరంపై ఎవ్వరూ నోరు మెదపడం లేదు. ఇలాంటి సున్నిత సందర్భంలో.. ప్రత్యేక పరిస్థితుల్లో మాజీ మంత్రి హరి రామజోగయ్య చేస్తోన్న కామెంట్లు.. రాస్తోన్న లేఖలు చర్చనీయాంశంగా మారుతున్నాయి.పవన్ కళ్యాణ్‌ను సీఎం చేయడానికి చంద్రబాబు అంగీకరిస్తేనే పొత్తు ఉంటుందని, లేకుంటే లేదని..రెండు పార్టీల పొత్తు లేకుంటే హంగ్ వస్తుందంటూ కామెంట్ చేశారు జోగయ్య. అసలే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించి ఊపు మీదున్న తెలుగుదేశం శ్రేణులు.. నేతలకు ఈ కామెంట్లు మంట పుట్టిస్తున్నాయి. అదెలా కుదురుతుందని మండిపడుతున్నాయి. కానీ.. అదంతా లోలోపలే తప్ప పైకి చెప్పుకోలేని పరిస్థితి టీడీపీ నాయకులది. జనసేన ఉంటే గెలుపు పక్కా అని.. కానీ జోగయ్య లాంటి వారు ఈ తరహా కామెంట్లు చేస్తూ ఉంటే అది అంతిమంగా జగన్‌కు లబ్ది చేకూరుతుందని అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయాన్ని కూడా గుర్తించాలని అంటున్నారు. ప్రస్తుతమున్న పరిణామాలు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పటి నుంచి ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకుంటే?హంగ్ అనేది ఒట్టి మాటేనని అంటున్నారు. గత ఎన్నికల్లో కూడా ఓటర్లు వన్ సైడ్‌గా వైసీపీకి ఓటేసేశారని, అలాగే వచ్చే ఎన్నికల్లో కూడా ఏదో ఒక పార్టీ వైపే మొగ్గుతారు తప్ప హంగ్ ప్రసక్తే ఉండదన్నది టీడీపీ వర్గాల మాట.హరిరామ జోగయ్య ఇలాగే మాట్లాడుతూ ఉంటే.. టీడీపీకి చెందిన ఏదోక నాయకుడు గట్టిగానే రియాక్ట్ అవుతారని, దాని పర్యవసానాలు ఎక్కడిదాకా వెళతాయో ఊహించడం కష్టమన్న అభిప్రాయం తెలుగుదేశం వర్గాల్లో బలంగా ఉంది. ఎంత సంయమనం పాటిస్తున్నా?రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, అది కూడా అసలు జనసేన పార్టీ నాయకుడు కూడా కాని జోగయ్య పొత్తు గురించి మాట్లాడటం ఏంటని మథన పడుతున్నారట. పవన్ కళ్యాణ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం.. అందరూ ఆయన చెప్పినట్టే నడవాలని ఓ పక్కన చెబుతూనే.. మరోవైపు పొత్తుల విషయంలో పుల్ల విరుపు మాటలు మాట్లాడుతున్నారనే చర్చ టీడీపీ వర్గాల్లో జరుగుతోంది. అసలు జనసేన పార్టీకి సంబంధించిన నేతలు కానీ.. పవన్ కళ్యాణ్ కానీ మాట్లాడకుండా.. మొత్తంగా ఆ పార్టీని నడిపించేది తానే అనే రీతిలో జోగయ్య మాట్లాడ్డమేంటంటూ టీడీపీ నేతలు లోలోపలే ఉడికి పోతున్నారట. ఆయన మాటలను వింటూ కూర్చోలేని పరిస్థితి. అలాగని బయటకు మాట్లాడలేని స్థితిలో టీడీపీ నేతలు ఉన్నారట. ఏం మాట్లాడితే ఏమవుతుందోనని అన్నీ కంట్రోల్‌లో పెట్టుకుని యోగా మోడ్‌లో ఉన్నారట ఎక్కువ మంది టీడీపీ నేతలు.బీజేపీకి ఆరెస్సెస్ తరహాలో జనసేనకు కేఎస్సెస్ అని జోగయ్య చేసిన కామెంట్లకు.. ప్రతిపాదనకు పవన్ కళ్యాణ్ ఎంత వరకు అంగీకరించారో లేదో తెలీదు కానీ.. ఈ సీనియర్ లీడర్ మాత్రం జనసేనకు తానే కేఎస్సెస్ అనే రీతిలో వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఈ తతంగం అంతా చూస్తోంటే.. ఇంకా పొత్తు పొడవకముందే ఘాటైన పోపు పెట్టి.. అసలుకే ఎసరు తెచ్చేలావ్యవహరిస్తున్నారనే ఆందోళన టీడీపీ వర్గాల్లో కన్పిస్తోంది. మరి జోగయ్య రాజకీయం ఏంటో? ఆయన వ్యాఖ్యల ప్రభావం ఎటు దారితీస్తుందోనన్న ఉత్కంఠ పెరుగుతోంది.

# అంబటికి షాక్ తప్పదా

గుంటూరు, ఏప్రిల్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అన్ని పార్టీలు ఎన్నికల మూడ్ లో ఉన్నాయి. గెలుపు కోసం పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో బిజీ అయితే.. ఎమ్మెల్యేలు, ఆశావాహులు అంతా సీటు కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే అధికార వైసీపీ కి ఈ సారి వర్గ పోటు తప్పడం లేదు. దాదాపు చాలా నియోజకవర్గాల్లో సీటు కోసం ఇద్దరు ముగ్గురు పోటీ పడే పరిస్థితి ఉంది. ఈ సారి సిట్టుంగుల్లో చాలామందికి సీటు కష్టమే అంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యేలతో సలు సార్లు సమావేశాలు నిర్వహించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి అప్పుడే క్లారిటీ ఇచ్చినట్టు సమాచారం.. దాదాపు 40 మందికి పైగా సిట్టుంగులు తమ గ్రాఫ్ పెంచుకోకుంటే సీటు లేదని వారి మొహం మీదే చెప్పేశారు అంటున్నారు. దీంతో ఆయా సీట్లలో ఆశావాహులు తమ ప్రయత్నాలు పెంచారు.. ఇప్పుడు మంత్రి అంబటి రాంబాబుకి కూడా షాక్ తప్పదా అనే ప్రచారం ఉంది.ఆయన్ను సత్తెనపల్లి నుంచి తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ఆ ప్రచారం సంగతి ఎలా ఉన్నా..? సత్తెనపల్లిలో అంబటి రాంబాబుకు షాక్ తగిలింది. సత్తెనపల్లిలోని మాజీ గ్రంథాలయ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. అంబటి సీటుకు గట్టిగానే పోటీ కనిపిస్తోంది.ఎన్నికలు ఎప్పుడు అన్నదానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయినా ఇప్పటి నుంచే సత్తెనపల్లి అంబటి సీటుకు అసమతి సెగలు గట్టిగానే తాకుతున్నాయి.. ఆయన వ్యతిరేక వర్గ నేత తాజాగాసత్తెనపల్లి సీటు విషయంలో అధిష్టానాన్ని కలుస్తానని చెప్పటం నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారింది. గతంలో అంబటి కి సీటు వద్దంటూ రెడ్డి సామాజిక వర్గం అధిష్టానాన్ని కలిసి ఫిర్యాదు కూడా చేసింది. అయితే అప్పటికి అంబటిపై మంచి ఇమేజ్ ఉండడడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది.. ఆయనపై పలు రకాలు ఆరోపణలు వస్తున్నాయి. తనకు కేటాయించిన శాఖపైనా పట్టు సాధించలేదని.. ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టడంలో ఫెయిల్ అయ్యారని ప్రచారం ఉంది. దీనికి తోడు ఇటీవల ఆయన పై ఆడియో కాల్స్ వ్యవహారం మరింత వ్యతిరేకత పెరిగింది.ఈ కారణాలను ప్రధానంగా హైలైట్ చేస్తూ.. అంబటికి మళ్లీ టికెట్ లేకుండా చేయాలని ప్రత్యర్థి గ్రూపు ప్రయత్నాలు మొదలెట్టింది. ఇందులో భాగంగా.. సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయిలో 4,000 మందితో కార్యకర్తలతో వైయస్సార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చర్చిస్తాం.. ఆత్మీయ సమావేశంలో రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఇతర సమాజిక వర్గాల నుంచి కూడా భారీగా పాల్గొంటారని ఊహాగానాలు జరుగుతున్నాయి.. వైసీపీ క్యాడర్ లో అంబటి తో సమన్వయ లోపం ప్రధానకారణం అంటున్నారు

# బండి సంజయ్ ను భర్తరఫ్ చేయాలి

నర్సంపేట గత రెండు రోజులుగా చర్చ జరుగుతున్న వరంగల్ జిల్లా పదవ తరగతి పరీక్షల పేపర్ లీకేజ్ ఉదంతంపై ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్పందించారు. పేపర్ లీకేజ్ కి పాల్పడి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలనే దురుద్దేశ్యంతో యువతను ఇలాంటి చర్యలకు ఉసిగొల్పినట్టు, పోలీస్ విచారణలో సాక్షాదారాలతో బయటపడిన దొంగ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చర్యలను ప్రశ్నిస్తూ, భాజపా వైఖరికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పట్టణ కమిటీకి పిలుపునిచ్చారు. ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధంచేసి, ఎం.పీ పదవి నుండి వెంటనే భర్తరఫ్ చేసి, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. తెలంగాణ సమాజంలో అలజడి సృష్టించి, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యే విధంగా పేపర్ లీకేజ్ కొరకు యువతను ప్రోత్సహించిన బండి సంజయ్ నుడ భాజాపా పార్టీని తెలంగాణ ప్రజలు ఈ ప్రాంతం నుండి బహిష్కరించాలని కోరారు.పేపర్ లీకేజ్ కు పాల్పడిన వ్యక్తి బండి సంజయ్ తో పాటు భాజపా ముఖ్య నాయకుల అందరితో కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్న వాటినే సాక్ష్యంగా.. బిజెపి కి అతనికి ఉన్న సాన్నిహిత్యంతోనే ఉద్దేశ్య పూర్వకంగా వాళ్లు కావాలనే ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలనే ఇలాంటి చర్యలకు పాల్పడినట్టు తెలిపారు. పోలీసు పర్యవేక్షణలో అన్ని రూల్స్ పాటిస్తూ, సిస్టమ్యాటిక్ గా నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రంలోకి ఆ సదరు బిజెపికి చెందిన వ్యక్తి గోడ దూకి మరీ అక్రమంగా పరీక్ష కేంద్ర0లోకి చొరబడాల్సిన అవసరం ఏముంది...?పరీక్ష పేపర్ ని ఫోటో తీసుకొని ఆ ఫోటోను వెంటనే బండి సంజయ్ కి పంపాల్సిన అవసరం ఏముంది..?ఇంతేకాక వేరే వేరే జిల్లాల్లో పరీక్ష పేపర్లు లీకైనట్టు వస్తున్న ఉదంతాల్లో కూడా ఖచ్చితంగా బీజేపీ పాత్ర దాగి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మరియు నర్సంపేట రూరల్ మండలాధ్యక్షులు ఎంపీపీ మరియు జడ్పిటిసి గార్లు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, క్లస్టర్స్, ముఖ్య నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ ఎస్ కుట్రలకు బీజేపీ భయపడదు



**బిజెపి ఎపి అధ్యక్షుడు సోమువీర్రాజు**

గుంటూరు ఫిరంగపురం లో వినాయక విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గం. పురాతన మందిరాలపై ఈ ప్రభుత్వం లో ఎందుకు దఫదఫాలుగా ఈ చర్యలు జరుగుతున్నాయి . రామతీర్థం, అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ ఆలయంలో వెండి సింహాల చోరీ తో పాటు పలు ఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయని బిజెపి ఎపి అధ్యక్షుడు సోమువీర్రాజు అన్నారు. రాష్ట్రంలో హైందవ ధర్మాన్ని అపహాస్యం చేస్తుంది. రాష్ట్రంలో ఆలయాల్లోని విగ్రహాలు ధ్వంసం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదు ..ఒక్కరినీ ఎందుకు అరెస్ట్ చేయడం లేదు. విగ్రహాలు ద్వంసం చేసిన వారిని అరెస్ట్ చేయమని అడిగితే మాపై అక్రమ కేసులు బనాయించారు. ఫిరంగిపురం వినాయకుని విగ్రహం ధ్వంసం లో కుట్ర దాగి ఉంది. విగ్రహ ధ్వంసం ఘటనలో నిందితులను అరెస్ట్ చేయకుంటే కపిలతీర్థం నుంచి రామతీర్థం దాకా యాత్రచేపడతామని అన్నారు.బండి సంజయ్ అక్రమ అరెస్ట్ ను ఖండిస్తున్నా. ఇది ముమ్మాటికి బిఆర్ ఎస్ ప్రభుత్వ పిరికిపంద చర్య. ఇటువంటి చర్యలకు బిజెపి భయపడదు. పదవ తరగతి పరీక్ష పేపర్ లీక్ లో అధ్యక్షుడి పాత్ర అనేది కుట్ర. గతంలో ఇలానే కుట్రలు పన్ని ఉస్ కాకి అయిపోయారు. మోదీ ని ఎదుర్కొనేందుకు డబ్బు సంపాదించాలనే కెసిఆర్ ఇడువంటి కుట్రలు పన్నుతున్నారు. బిఆర్ ఎస్ కుట్రలకు బిజెపి భయపడదని అన్నారు. జనసేన బిజెపి కలిసే ఉన్నాం. పవన్ తో పొత్తులో ఉన్నాం కాబట్టే మా ఆద్యక్షుడ్ని పవన్ కలిశారు. మేం ఇద్దరం కలిసి వైసిపి ప్రభుత్వాన్ని పడగొట్టేవరకు కలిసి ఉద్యమిస్తాం. చంద్రబాబు ను కలిసినంత మాత్రాన పొత్తులో ఉన్నారంటే ఎలా అని అన్నారు.ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఫైట్ చేస్తాం. తరువాత అయన బాబూ జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగ్జీవన్ రాం మన దేశానికి ఆదర్శ పురుషుడు . రైతులను ఆదుకోవడానికి ఆయన చేసిన సేవలు నేటి కి మరువలేనివి అన్నారు

# వెయిట్ లిఫ్టింగ్ లో మహిళలు రాణించడం అభినందనీయం

కాకినాడ శారీరిక బలాన్ని పెంపొందించడానికి తోడ్పడే వెయిట్ లిఫ్టింగ్ లో కూడా మహిళలు పాల్గొని పలు పతకాలు సాధించడం హర్షనీయమని ప్రముఖ క్రీడాకారుడు, దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల పాట్నా లో జరిగిన మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్లో రజిత పతకం సాధించిన కాదులూరి అభిషిక్త అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్లు బలం అథ్లెటిక్స్ లో కీలకమన్నారు. వెయిట్ లిఫ్టింగ్ లో శిక్షణ వలన ఆత్మవిశ్వాసం తో పాటు పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. క్యాలరీలను వేగంగా ఖర్చు చేయడంతో పాటు శారీరక బలం, కండరాల శరీరాకృతిని అభివృద్ధి చేయడానికి వెయిట్ లిఫ్టింగ్ తోడ్పడుతుందని అన్నారు. జీవ క్రియను పెంచడంతోపాటు కండరాల పనితీరును మెరుగుపరుస్తుందని అన్నారు. ప్రముఖ సామాజిక వేత్త రాజారపు మహేష్ మాట్లాడుతూ భువనేశ్వర్ లో సోషియాలజీ ఆనర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభిషిక్త బుద్ధగయలో జరిగిన జూనియర్ నేషనల్ టోర్నమెంట్లో కాంస్య, ఇండోర్లో జరిగిన యూత్ నేషనల్ టోర్నమెంట్ లో కాంస్య పతకాన్ని సాధించడం హర్షనీయమని అన్నారు . ఈ సందర్భంగా మహేష్ అభిషిక్తకు ఐదువేల రూపాయలు బహుమతిగా అందజేశారు. అభి షిక్త మాట్లాడుతూ తాను ఇప్పటికే జాతీయ స్థాయిలో ఎనిమిది సార్లు వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. పెద్దల ఆశీస్సులతో వెయిట్ లిఫ్టింగ్ లో మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేస్తానని అన్నారు.అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో అభిషిక్తను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ఎస్. శ్రీ నగేష్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, రాజా, అడబాల సత్యనారాయణ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఆది చెన్నకేశవ స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

బద్వేలు బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లి గ్రామం జాతీయ రహదారి పక్కన వెలిసి ఉన్న శ్రీ ఆది చెన్నకేశవ స్వామిని బుధవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధ దర్శించుకున్నారు వేద పండితుల మంత్రలతో ఘన స్వాగతం పలికిన ఆలయ ట్రస్ట్ బోర్డ్ కమిటీ సభ్యులు×ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వాకమళ్ళ రంగారెడ్డి తో పాటు పలువురు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సుద, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి కి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కఠోర వాస్తవాలను మాట్లాడటం, ప్రజలకు తెలియజేయడం పత్రికల కర్తవ్యం



**పత్రికా రంగంపై అసమంజసమైన ఆంక్షలను రాజ్యం విధించకూడదు**

**దీనివల్ల పత్రికా స్వేచ్ఛపై ప్రభావం పడుతుంది**

**మీడియా స్వేచ్ఛపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ ఏప్రిల్ 5 విమర్శాత్మక అభిప్రాయాలను వ్యక్తం చేయడం ప్రభుత్వ వ్యతిరేకత కాదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. మలయాళం వార్తా చానల్ మీడియావన్ కు భద్రతపరమైన అనుమతులను మంజూరు చేయడానికి నిరాకరించిన కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. జాతీయ భద్రతకు ముప్పు అని గాలి కబుర్లు చెప్తున్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖను దుయ్యబట్టారు.ప్రజల హక్కులను నిరాకరించడానికి కారణంగా దేశ భద్రతను చూపించకూడదని జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం చెప్పింది. దీనిని ఈ కేసులో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ చాలా నిర్లక్ష్యంగా చూపించిందని తెలిపింది. ప్రజల హక్కులను ప్రభావితం చేసే దర్యాప్తు నివేదికలను చూపించి, తప్పించుకోవడం సాధ్యం కాదని తెలిపింది. పత్రికా రంగంపై అసమంజసమైన ఆంక్షలను రాజ్యం విధించకూడదని చెప్పింది. దీనివల్ల పత్రికా స్వేచ్ఛపై ప్రభావం పడుతుందని, కఠోర వాస్తవాలను మాట్లాడటం, ప్రజలకు తెలియజేయడం పత్రికల కర్తవ్యమని తెలిపింది.ప్రభుత్వ విధానాలపై మీడియావన్ చానల్‌కు విమర్శాత్మక అభిప్రాయాలు ఉండటాన్ని ప్రభుత్వ వ్యతిరేకతగా అభివర్ణించకూడదని పేర్కొంది. అటువంటి పద ప్రయోగం చేయడంలోనే పత్రికా రంగం తప్పనిసరిగా ప్రభుత్వానికి మద్దతివ్వాలనే భావం వ్యక్తమవుతోందని తెలిపింది.మీడియావన్ టీవీ చానల్ ఢిల్లీ హింసాకాండను ప్రసారం చేయడంపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 2020లో అభ్యంతరం వ్యక్తం చేసింది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ రూల్స్, 1994 నిబంధనలను ఉల్లంఘించినందుకు 48 గంటలపాటు ఆ చానల్ ప్రసారాలను నిషేధించింది. 2022లో ఆ చానల్ లైసెన్స్ పునరుద్ధరణ కాకపోవడంతో ప్రసారాలు పూర్తిగా నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం భద్రతా కారణాలను చూపించింది, అయితే అందుకు తగిన వివరాలను వెల్లడించలేదు. ఆ చానల్ పెట్టుబడిదారుల్లో అత్యధికులు కేరళ చాప్టర్ జమాతే ఇస్లామీ సంస్థకు చెందినవారని, దానిని నిషేధించడానికి అది ఓ కారణం కావచ్చునని వార్తలు వచ్చాయి. ఆ చానల్ హైకోర్టును ఆశ్రయించడంతో కేంద్ర ప్రభుత్వ నిషేధ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపేసింది. 2022 ఫిబ్రవరిలో సింగిల్ జడ్జి ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. డివిజన్ బెంచ్ కూడా సమర్థించడంతో ఆ చానల్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# శివధనుర్భంగాలంకారంలో రాములవారి రాజసం

బద్వేలు ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివధనుర్భంగాలంకారంలో రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 8 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వయంవరం సమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధనుర్భంగాలంకారం. సీతారాముల కల్యాణం రోజున ఉదయం ఈ అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఏఈఓ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు..

# కలిస్తే పొత్తు పెట్టుకున్నట్టేనా

విజయవాడ, ఏప్రిల్ 5, ఏపీ రాజకీయాల్లో అనూహ్యంగా మారుతున్న పరిణామాలు, పొత్తులపై విస్తృత చర్చ జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ ఢిల్లీ వెళ్లి బీజేపీ హైకమాండ్‌ను కలిశారు. బీజేపీ , జనసేన .. వైఎస్ఆర్‌సీపీ ముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నాయని ప్రకటించారు. ఈ అంశంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు స్పందించారు. జనసేన, బీజేపీ కలిసే ఉన్నాయని.. కలిసే ముందుకు వెళతామన్నారు. ఈ ప్రభుత్వం పై ఇద్దరం కలిసే పోరాడతామన్నారు. కలిసి ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భవిష్యత్తులో కూడా జనసేన, బీజేపీ కలిసే ప్రయాణం చేస్తుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. రాజకీయ అవసరాల కోసం సహజంగా అనేక పార్టీ నేతలను కలుస్తామని.. గతంలో చంద్రబాబును కూడా రాష్ట్రపతికి మద్దతు ఇచ్చిన సమయంలో కలిశామని.. అలా కలిసిన వారందరితో పొత్తు ఉన్నట్లు కాదని సోము వీర్రాజు తెలిపారు. అయితే పవన్ కళ్యాణ్ తమ పార్టీ పెద్దలను కలిసి మాట్లాడారంటే తమ బంధం ఎంత బలమైనదో తెలుసుకోవాలని సోము వీర్రాజు పేర్కొన్నారు. తామిద్దరం కలిసి వైసీపీ ప్రభుత్వం మీద ఉద్యమిస్తామని వెల్లడించారు. ఇందులో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. రాజకీయాల్లో కొన్ని రచనలు జరుగుతాయన్నారు. నాయకులు ఏది మాట్లాడినా ఒక వ్యూహంతో మాట్లాడతారన్నారు. మా సత్యకుమార్, ఇతర నేతలపై దాడి అందరూ చూశారన్నారు. తమ పార్టీ అధిష్టానం కూడా ఈ విషయంలో సీరియస్ గా ఉందని సోము వీర్రాజు వెల్లడించారు.బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశం తర్వాత పవన్ కళ్యాణ్ .. అధికారం సాధించే దిశగానే చర్చలు జరిపామని ప్రకటించారు. బీజేపీ, జనసేన లక్ష్యం వైసీపీని ఓడించడమన్నారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చల వల్ల రాబోయే రోజుల్లో మంచి ఫలి?లు వస్తాయన్నారు. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ జనసేన ఎజెండా అని అని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అన్ని విషయాలు చెబుతానని పవన్ చెప్పారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనేదే మాటకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

మురళీధరన్ తో రెండుసార్లు సమావేశమైన పవన్ రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఏపీలో బీజేపీ-జనసేన మధ్య అధికారికంగా పొత్తున్నప్పటికీ ఈ రెండు పార్టీలు ఉమ్మడిగా ఒక్క కార్యక్రమాన్ని కూడా నిర్వహించడంలేదు. తెలుగుదేశం పార్టీకి చేరువవుతున్న జనసేనాని బీజేపీ కూడా పొత్తుకు కలిసిరావాలని కోరుతున్నట్లుగా చెబుతున్నారు. అయితే ఈ విషయంలో ఆలోచన ఏమిటన్నదానిపై క్లారిటీ లేదు. ఇప్పటికీ బీజేపీ, జనసేన పొత్తులోనే ఉన్నాయి. కానీ ఏపీలో మాత్రం కలిసి పని చేయడం లేదు. రాష్ట్ర నాయకులతో తనకు గ్యాప్ ఉందని పవన్ కళ్యాణ్ చెబుతున్నారు. వారు వైసీపీపై పోరాటం చేయడం లేదని పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే బీజేపీ నేతలు కూడా అడిగినప్పుడు కూడా జనసేన మద్దతు ప్రకటించలేదని.. పొత్తు ఉన్నా లేనట్లేనని ప్రకటించేశారు. ఈ పొత్తుల సస్పెన్స్ అలా కొనసాగుతూనే ఉంది.

# సామాజిక సమానత్వం కోసం పోరాడిన యోధుడు

**డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు**

**మున్సిపల్ ఛైర్మన్ దాసిసుధాకర్ రెడ్డి**

నందికొట్కూరు ఒకవైపు స్వేచ్ఛాయుత భారతావని కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం విశ్రమించకుండా సమర శంఖం పూరించిన విప్లవ యోధుడు, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు.మున్సిపల్ కార్యాలయం చైర్మన్ ఛాంబర్ నందు స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రావు . 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమర యోధులు, దళిత హక్కుల కోసం కృషిచేసిన మహోన్నత వ్యక్తి, అహింసామూర్తి, రాజ్యాంగ సభ సభ్యులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారు జీవిత కాలంలో ఎన్నో అవమానాలు, ఆటంకాలు ఎదుర్కొని సమాజాన్ని ప్రభావితం చేయగలిగారన్నారు. 52 ఏళ్లపాటు పార్లమెంటును ఏలిన మహా అనుభవ శీలి. వ్యవసాయ, రక్షణ, ఆరోగ్య, రైల్వేశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన సేవలు అనిర్వచనీయమన్నారు. ఇటువంటి మహనీయుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో, జూపాడుబంగ్లా జడ్పీటీసీ సభ్యులు పోచ జగదీశ్వర రెడ్డి , వైస్ చైర్మన్ శ్రీమతి అర్షపోగు ప్రశాంతి , నంద్యాల జిల్లా శాప్ కో-ఆర్డినేటర్ స్వామిదాసు రవికుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు లాలు ప్రసాద్, పి.చాంద్ భాష, నాయబ్, బొల్లెద్దుల రామక్రిష్ణ, కురువ శ్రీను, మార్కెట్ రాజు, కోసిక తిరుమలేశ్వర రెడ్డి, రైతు సంఘం బాబు, బి.సి నాయకులు కె.వి రమణ, మైనారిటీ నాయకులు అబూబక్కర్, కిరణ్ కుమార్ రెడ్డి, కురువ శ్రీను,పి.రమేష్, తదీతరులు పాల్గొన్నారు.

# ఓటమి ఎరుగని ప్రజానాయకుడు జగ్జీవన్ రామ్

ఎమ్మిగనూరు , ఎమ్మిగనూరు పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత హక్కుల పరిరక్షకుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదును ప్రకటించి గౌరవించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. మాజీ కేంద్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు గౌ శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయం నందు ×డా. బాబు జగ్జీవన్ రామ్ 115వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ....1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, చాంద్వా గ్రామంలో... నిమ్న జాతి కులంలో జన్మించిన జగ్జీవన్ రామ్ బాల్యం నుంచే దేశభక్తిని పునికి పుచ్చుకొని జాతీయోద్యమమైన స్వాతంత్ర్య సంగ్రామంలో... పాల్గొని పరాయి పాలకులతో పోరాడిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడని కొనియాడారు. కేంద్రంలో అనేక కీలక శాఖలకు మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, దేశానికి ఉప ప్రధానిగా సేవలు అందించి దేశ సమగ్రతకు, అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన పరిపాలనా దర్శకుడని తెలిపారు.1971 లో.. పాకిస్తాన్ తో యుద్ధం చేసి గెలుపు సాధించి పెట్టి తూర్పు పాకిస్తాన్ ప్రస్తుతం "బంగ్లాదేశ్" కు స్వాతంత్ర్యం అందించి ప్రపంచంలోనే భారతదేశానికి గౌరవాన్ని, కీర్తిని ప్రసాదింప చేసిన ఘనత ఆ మహనీయునికే దక్కిందన్నారు. జగ్జీవన్ రామ్ మరణించేంతవరకు "ససారాం" లోకసభ స్థానం నుండి 9సార్లు పార్లమెంట్

## జగ్జీవన్ రామ్ కు "భారతరత్న" బిరుదును ప్రకటించాలి

సభ్యుడుగా ఎన్నికైన ఓటమెరుగని ప్రజా నాయకుడు అని కొనియాడారు. ఇలాంటి మహోన్నత నాయకుడికి "భారతరత్న" బిరుదును ప్రకటించి గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి. అల్తాఫ్, ఆం.ప్ర.రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మల్కా పురం పురుషోత్తం రెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు గోకారమ్మ, టౌన్ నాయకులు కోడిగంటి శంకరన్న,

యన్. సురేష్ కుమార్, కె.యం.డి.అబ్దుల్ జబ్బర్, రోజా ఆర్ట్స్ ఉసేని, బెస్త హనుమంతు, సిద్ద రామేశ్వర రెడ్డి, పట్టణ టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు గోరాభాష, మహబూబ్ బాషా,మేటి వలి భాష,ఆఫ్గన్ వలిభాష, యస్.సి.సెల్ నాయకులు దర్జీ మోషన్న, మాల మునిస్వామి, సాల్మన్, వన్నెల మోష, జాలవాడి ఏసన్న, జె. జయపాల్, 6వ వార్డు శంకర్, యన్.ఆదెన్న, ఎమ్మిగనూరు మండలం టిడిపి నాయకులు గుడికల్ కోలంట్ల వెంకటేష్, కె. తిమ్మాపురం బి.టి.చిన్న హనుమంతు, కందనాతి మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా...

**ఎమ్మెల్యే శ్రీదేవి**

**మహిళల అభివృద్ధే ముఖ్యమంత్రి యొక్క లక్ష్యం**

**జొన్నగిరి గ్రామంలో ఘనంగా వైయస్సార్ ఆసరా కార్యక్రమం**

తుగ్గలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మహిళలకు ఆర్థిక భరోసాను ఇస్తున్నాయని పత్తికొండ ఎమ్మెల్యే కంగ్రాటి శ్రీదేవి అన్నారు.బుధవారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామంలో మూడవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా స్వాతంత్ర సమరయోధుడు దళిత తొలి ఉప ప్రధాని నవ సమాజ స్థాపనకై కృషిచేసిన పోరాట యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చిత్రపటానికి పూలమాలవేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వైయస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొని అర్హులందరికీ సంక్షేమ పథకాలు పేదల ఇంటి ముంగిటికే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం మన ప్రభుత్వమే అని ఎమ్మెల్యే శ్రీదేవి తెలియజేశారు.ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న వైయస్సార్ జగనన్న తోడు,వైయస్సార్ ఆసరా,అమ్మఒడి,సున్నా వడ్డీ రుణాలు వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసాలు ముఖ్యమంత్రి కల్పిస్తున్నారని ఎమ్మెల్యే తెలియజేశారు.ఎన్నికలలో మగవారితో సమానంగా 50% మేరా మహిళలకు సీట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెందుతుందని ఎమ్మెల్యే తెలియజేశారు.బుధవారం జొన్నగిరిలో మండల స్థాయి వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో 6914 మంది డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా పథకం కింద రూ3.82 కోట్ల చెక్కును మహిళలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీదేవి డ్వాక్రా మహిళలతో కలసి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

# కాకినాడ జిల్లా ప్రధమ వార్షికోత్సవం

కాకినాడ పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా చిన్న జిల్లాల ఏర్పాటుతో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని కాకినాడ జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అన్నారు. కాకినాడ జిల్లా ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కలెక్టరేట్ వివేకానందహాల్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. తొలుత కలెక్టర్ డా. కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియలను వేద పండితులు ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్ తదితరులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు బృంద స్ఫూర్తితో పనిచేయడం వల్ల మంచి ఫలితాలు సాధించగలిగామని పేర్కొన్నారు. ఇందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. గతేడాది కాలంలో జిల్లా సాధించిన పురోగతి స్ఫూర్తితో బాగా పనిచేసి మరింత పురోగతి సాధించేందుకు కృషిచేయనున్నట్లు వెల్లడించారు. వివిధ అంశాలను తమ దృష్టికి తీసుకొచ్చి ప్రజా సేవల విస్తృతికి కృషిచేసినందుకు మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. అదే విధంగా ఏడాది కాలంలో జిల్లాలో వివిధ శాఖలు సాధించిన ప్రగతిని కలెక్టర్ వివరించారు.జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతి నెలా మొదటి సోమవారం మండల/నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని.. అర్జీలను 99 శాతం మేర నిర్దేశ గడువులోగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కీలక ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న కాకినాడలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. కాకినాడ పార్లమెంటు సభ్యులు ఇప్పటికే ఈ విషయమై కృషిచేస్తున్నారన్నారు. రబీ 2021, ఖరీఫ్ 2022 సీజన్లలో రైతుల నుండి రూ. 1,100 కోట్ల విలువైన 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని మద్దతు ధరకు కోనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం సేకరణపై రైతులు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. రైజ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆంగ్లభాషా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని తుని, కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 5,310 మంది విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఈ కార్యక్రమాన్ని అమలుచేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు గత సంవత్సరం నిర్వహించిన కంబైన్డ్ రిక్రూట్ మెంట్ ద్వారా ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 717 సిబ్బంది పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. తొండంగి మండలంలో రెండువేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న బల్క్ డ్రగ్ పార్క్ జిల్లా పారిశ్రామిక ప్రగతిలో మైలురాయిగా నిలవనుందన్నారు. దేశంలో న్యూఢిల్లీ, కోల్‌కతాలో మాత్రమే ఉన్న ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) క్యాంపస్ కాకినాడలోనూ ప్రారంభించడం జరిగిందని.. త్వరలో కోనపాపపేట వద్ద 25 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులతో శాశ్వత ప్రాంగణం నిర్మాణానికి శంకుస్థాపన జరగనుందని తెలిపారు. వ్యాపారాలు దిశగా నడిపించి,

ఆర్థికంగా ఎదిగేందుకు వీలుగా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు చేయూత మహిళా మార్టులతో పాటు సామర్లకోట టీటీడీసీ ప్రాంగణంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో వస్త్ర బ్రాండ్‌తో రెడీమేడ్ వస్త్ర తయారీ యూనిట్ పనిచేస్తోందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలోనూ, మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయడంలోనూ పోలీసు శాఖ బాగా పనిచేసిందని కలెక్టర్ వివరించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం క్రింద కాకినాడ జిల్లాలో ఇప్పటికే 14,587 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసినట్లు తెలిపారు. వందేళ్ల తర్వాత చేపట్టిన సమగ్ర భూ సర్వేలో భాగంగా 149 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేసినట్లు కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీవోలు బీవీ రమణ, జె.సీతారామారావు, డీఎస్పీ అంబికా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పర్ పాస్ బ్రిడ్జి కొరకు భూమి పూజ చేసిన మేయర్ డాక్టర్ శిరీష,ఉప మేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణ

**తిరుపతి నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిల్పడమే మా లక్ష్యం**

**నగర మేయర్ డాక్టర్ శిరీష**

తిరుపతి తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 25వ డివిజన్ లో సుమారు 48 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న కస్తూరిబాయ్ వీధి నుండి కర్నాల వీధులను కలుపుతూ అప్పర్ పాస్ బ్రిడ్జి పనులకు బుధవారం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 25 డివిజన్లో రైల్వే అండర్ బ్రిడ్జ్ కనెక్టివిటీ రోడ్డుకి భూమి పూజ చేయడం జరిగిందని సుమారు 48 లక్షల రూపాయల వ్యయంతో బుధవారం నుండి పనులు ప్రారంభం చేస్తున్నామని రెండు నెలలు పనులు పూర్తి చేసే విధంగా అధికారులను ఆదేశించడం జరిగిందని తెలియజేశారు. ఆర్.సి.రోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జి ఉన్నందువల్ల కస్తూరిబాయి వీధి నుండి కర్నాల వీధికి కలుపుతూ అప్పర్ పాస్ బ్రిడ్జి నిర్మిస్తామని ప్రజలకు అందుబాటు తీసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.ఉప మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ రాయల్ చెరువు అండర్ బ్రిడ్జి పైన అప్పర్ పాస్ బ్రిడ్జి పనులకు సంబంధించి పనులు భూమి పూజ కార్యక్రమం జరిగిందని తెలియజేశారు.

# చిరంజీవి గారితో ఇలాంటి సీన్ ఏంటి అని అన్నారు

శాకుంతలం సినిమా తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న దర్శకుడు గుణశేఖర్ ఆ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ బిజీగా ఉన్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు గుణశేఖర్ తన సూపర్ హిట్ చిత్రం చూడాలని ఉంది చిత్రంలోని రైల్వే స్టేషన్



సన్నివేశానికి సంబంధించిన జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.అశ్వినీదత్ నిర్మించిన చూడాలని ఉంది సినిమాలోని రైల్వే స్టేషన్ సన్నివేశం ఎవర్ గ్రీన్ సూపర్ లవ్ సన్నివేశం అనడంలో సందేహం లేదు. పది నిమిషాల పాటు సాగే ఆ సన్నివేశంలో ఒక్క డైలాగ్ కూడా ఉండదు. ఆ సన్నివేశంలోనే హీరో మరియు హీరోయిన్ మధ్య ప్రేమ ఏర్పడుతుంది. అలాంటి ఒక లవ్ సీన్ ను చిరంజీవితో చేయడాన్ని కొందరు తప్పుబట్టారు అంటూ దర్శకుడు గుణ శేఖర్ చెప్పుకొచ్చారు.గుణశేఖర్ మాట్లాడుతూ.. తొలి ప్రేమ సినిమా తో లవ్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ అయిన పవన్ కళ్యాణ్ గారితో ఇలాంటి లవ్ సీన్ బాగుంటుంది. చిరంజీవి వంటి సీనియర్ స్టార్ తో ఇలాంటి లవ్ సీన్ చేయడం తప్పుడు నిర్ణయం అంటూ అప్పట్లో నాతో కొందరు అన్నారు. అయితే చిరంజీవి గారు నన్ను నమ్మారు. డైలాగ్ లేకుండా 18 పేజీల సీన్ పేపర్స్ రెడీ చేశాను.

చిరంజీవి గారికి ఆ సీన్ పేపర్స్ చూపిస్తే అబ్బా అని షేక్ హ్యాండ్ ఇచ్చారు.సీన్ లోని ప్రతి కదలికను పక్కా ప్లాన్ తో పేపర్ పై రాసుకుని స్క్రీన్ ప్లే రాసుకుని చిత్రీకరించేందుకు రెడీ అయ్యాం. ఈ సీన్ షూటింగ్ కి ఒరిజినల్ లొకేషన్ కావాలని నిర్మాత అశ్వినీదత్ గారితో అన్నాను. చిరంజీవి వంటి పెద్ద స్టార్ తో ఒరిజినల్ రైల్వే స్టేషన్ లో షూటింగ్ ఎలా అంటూ అవాక్కయ్యారు. నేను పట్టుబట్టడంతో నాంపల్లి మరియు కాచిగూడ రైల్వే స్టేషన్ లో షూటింగ్ కు ఏర్పాట్లు చేశాం.ఒక రోజు నాంపల్లి రైల్వే స్టేషన్ లో షూటింగ్ చేశాం.. మరో రోజు కాచిగూడ రైల్వే స్టేషన్ లో షూటింగ్ చేశాం. ఆ రెండు రోజులు కూడా రైల్వే స్టేషన్ లో జనాలను కంట్రోల్ చేయడం కోసం అశ్వినీదత్ గారు కర్ర పట్టుకుని ఉండాల్సి వచ్చింది. ఆ షూటింగ్ కారణంగా ఎంతో మంది వాళ్లు ఎక్కాల్సిన రైలు మిస్ చేసుకున్నారు.ఆ సన్నివేశం పై నమ్మకంతో చిరంజీవి గారు నాకు ఓకే చెప్పడం.. ఆ తర్వాత షూటింగ్ లో కూడా ఎంతో ఓపికతో పాల్గొనడం జరిగింది. ప్రత్యేకంగా రైల్వే స్టేషన్ సెట్ వేయమని నిర్మాత అన్నా కూడా నేను ఒరిజినల్ లొకేషన్ కావాలంటూ పట్టుబట్టడంతో ఆయన అందుకు సంబంధించిన అనుమతులు తీసుకుని షూటింగ్ సమయంలో చాలా కష్టపడ్డారు. అందరం అంతగా కష్టపడ్డాం కనుక రైల్వే స్టేషన్ సీన్ బాగా వచ్చిందని గుణశేఖర్ చెప్పుకొచ్చాడు.


# ఎన్టీఆర్ పక్కన కండిషన్స్ అప్లై అంటున్నారు



ఎన్టీఆర్ 30 ప్రస్తుతం హైదరాబాద్ లో చిత్రీకరణ జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. కొరటాల శివ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. జాన్వీకి తెలుగులో ఇది తొలి సినిమా. అయితే ఆదిపురుష్ లో రావణ్ (విలన్) గా నటిస్తున్న బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ కి కొరటాల ప్రతినాయకుడి పాత్రను ఆఫర్ చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే సైఫ్ కాల్షీట్ల సమస్యతో ఈ ఆఫర్ ని సున్నితంగా తిరస్కరించినట్టు వార్తలు వస్తున్నాయి.కేజీఎఫ్ ఫ్రాంఛైజీ రెండో భాగంలో బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ విలనీ పెద్ద రేంజులో వర్కవుటైన సంగతి తెలిసిందే. అధీరాగా అతడు దుమ్ము దులిపాడు. ఇప్పుడు అదే రేంజులో ప్రభాస్- ఆదిపురుష్ 3డిలో సైఫ్ ఖాన్ రావణ్ పాత్ర వర్కవుటవుతుందని అభిమానులు భావిస్తున్నారు. అయితే ఇంతకుముందు రిలీజ్ చేసిన ఆదిపురుష్ విజువల్స్ నాశిరకం గ్రాఫిక్స్ వీఎఫ్ ఎక్స్ వర్క్ తో తీవ్రంగా నిరాశపరచగా సైఫ్ లుక్ పైనా ఓంరౌత్ పైనా తీవ్రమైన ట్రోలింగ్ జరిగింది. ఇలాంటి సమయంలో అతడు ఎన్టీఆర్ తో భారీ సినిమా ఆఫర్ ని తిరస్కరించడంతో అభిమానుల నుంచి స్పందన అనూహ్యంగా ఉంది.వీలున్నంత వరకూ సైఫ్ తో కుదరకపోయినా.. బాలీవుడ్ నుంచి ప్రామినెంట్ స్టార్లలో ఎవరైనా కొత్త ముఖాన్ని తెలుగు తెరకు పరిచయం చేస్తే బావుంటుందన్న అభిప్రాయాన్ని తారక్ అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. కొరటాలకు సూటిగా సోషల్ మీడియాల్లో ఈ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అజయ్ దేవగన్ - విద్యుత్ జమ్వాల్ - నీల్ నితిన్ ముఖేష్ లాంటి వాళ్లు ఇప్పుడు పాతబడిపోయిన ముఖాలు. సల్మాన్ ఖాన్ త్వరలోనే వెంకీతో కలిసి కిసీ కా భాయ్ అంటూ సౌత్ లో ప్రవేశిస్తున్నాడు.పఠాన్ తెలుగు అనువాదంతో షారూఖ్ కూడా తెలుగు థియేటర్లలో సందడి చేసాడు. రణబీర్ బ్రహ్మాస్త్ర తెలుగనువాదంతో వచ్చాడు. అమితాబ్- సునీల్ శెట్టి వంటి స్టార్లు తెలుగు సినిమాల్లో నటించారు. వీళ్లెవరూ కాకుండా ఇటీవల ట్రెండింగ్ లో ఉన్న మరో స్టార్ హీరోని వెతికి టాలీవుడ్ కి పరిచయం చేస్తే బావుంటుందని కొరటాల శివను తారక్ అభిమానులు కోరుతున్నారు. భారీ స్పాన్ తో భారీ బడ్జెట్ తో పాన్ వరల్డ్ రేంజులో రూపొందుతున్న ఎన్టీఆర్ 30 మరో లెవల్లో ఉండాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. దానికి తగ్గట్టు కొరటాల మైండ్ గేమ్ వర్కవుట్ చేయాలని కోరుకుంటున్నారు.జనతా గ్యారేజ్ గ్రాండ్ సక్సెస్ తర్వాత దర్శకుడు కొరటాల శివ జూనియర్ ఎన్టీఆర్ తో కలిసి చేస్తున్న రెండవ చిత్రం ఎన్టీఆర్ 30. ఇంటర్నేషనల్ స్టంట్ డైరెక్టర్ కెన్నీ బేట్స్ సినిమాలోని చాలా యాక్షన్ సీక్వెన్స్ లను పర్యవేక్షించనున్నారు. గతంలో కెన్నీ బేట్స్ ట్రాన్స్ఫార్మర్స్- రాంబో ఎవిఎ లాంటి భారీ అంతర్జాతీయ ప్రాజెక్టులకు పనిచేశారు. దర్శకుడు కొరటాల శివ ఎన్టీఆర్ 30 ని ఇండియాస్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ గా కెరీర్ బెస్ట్ ఫిల్మ్ గా తెరకెక్కించి సత్తా చాటాలని చాలా కాలంగా కసరత్తులు చేసిన సంగతి తెలిసిందే.

# పెళ్లి.. ఫుల్ క్లారిటీతో ఉన్న అక్కినేని హీరో

ఈ జెనరేషన్ లో హీరోలు చాలా మంది వెంటనే పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడటం లేదు. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్ అనే బ్రాండ్ నే మెయింటేన్ చేస్తూ ఉన్నారు. కొంత మంది అయితే పెళ్లి పై అస్సలు ఆసక్తి కూడా చూపించడం లేదు. శర్వానంద్ గత ఏడాది చివర్లో ఎంగేజ్ మెంట్ చేసుకున్నాడు. ప్రస్తుతం ఇండస్ట్రీలో బ్యాచ్ లార్స్ గా ఉన్నవారిలో ప్రభాస్ టాప్ లో ఉంటాడు.తని తర్వాత మెగా హీరోలైన సాయి ధరమ్ తేజ్ వరుణ్ తేజ్ ఉన్నారు అలాగే అక్కినేని ఫ్యామిలీ నుంచి వచ్చిన మరో యంగ్ హీరో సుశాంత్ కూడా ఉన్నాడు. అతను హీరో గా చివరిగా ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమా చేశాడు. రవితేజ రావణాసుర సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పవర్ ఫుల్ రోల్ లో కనిపిస్తున్నాడు.ఈ క్యారెక్టర్ తనకి మంచి గుర్తింపు తీసుకొస్తుందని సుశాంత్ హోప్స్ పెట్టుకున్నాడు. ఇదిలా ఉంటే రావణాసుర ప్రమోషన్స్ లో సుశాంత్ పెళ్లి గురించి ఆసక్తికర మైన కామెంట్స్ చేశాడు. పెళ్లి చేసుకుంటే ఇప్పుడు ఉన్నదానికంటే ఎక్కువ హ్యాపీ గా ఉంటాను అనిపిస్తే అప్పుడు చేసుకుంటా. అయితే పెళ్లి తర్వాత హ్యాపీ గా ఉండరు అనేది నా అభిప్రాయం కాదు.నాకు ఇంకా ఆ టైమ్ రాలేదు అని అనుకుంటున్న. ప్రస్తుతానికి సినిమాల మీద తప్ప పెళ్లి చేసుకోవాలనే ఆలోచన అయితే లేదు అంటూ క్లారిటీ ఇచ్చారు. యాంకర్ పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అని అడిగిన ప్రశ్నకి సుశాంత్ ఈ విధంగా క్లారిటీ ఇవ్వడం విశేషం. సుశాంత్ తరహాలోనే మన యంగ్ హీరోలు కూడా పెళ్లి పై డిఫరెంట్ ఒపీనియన్స్ తో ఉన్నారు.ఇక ప్రభాస్ అయితే ఇంట్లో వాళ్ళు ఫోర్స్ చేసిన కూడా ఎందుకనో పెళ్లి గురించి పెద్దగా ఆలోచించడం లేదు.



# కేకేఆర్‌కు ఓ గుడ్ న్యూస్ మరో బ్యాడ్ న్యూస్




ఐపీఎల్-2023 సీజన్ ప్రారంభానికి ముందే కీలక ఆటగాళ్లు దూరమై, సీజన్ తొలి మ్యాచ్‌లోనే ఓటమిపాలై నానా తంటాలు పడుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఇవాళ (ఏప్రిల్ 5) ఓ గుడ్‌న్యూస్ మరో బ్యాడ్‌న్యూస్ తెలిసింది.వెన్ను సమస్య కారణంగా సీజన్ మొత్తానికే దూరమైన శ్రేయస్ అయ్యర్‌కు రీప్లేస్‌మెంట్‌గా ఇంగ్లండ్ ఓపెనర్, విధ్వంసకర బ్యాటర్ జేసన్ రాయ్‌ను ఎంపిక చేసుకుంది కేకేఆర్ యాజమాన్యం.బేస్‌ప్రైజ్ రూ. 1.5 కోట్లకు అదనంగా మరో 1.3 కోట్లు (2.8 కోట్లు) చెల్లించి రాయ్‌ను సొంతం చేసుకుంది కేకేఆర్ మేనేజ్‌మెంట్. ఐపీఎల్‌లో 2017, 2018, 2021 సీజన్లు ఆడిన రాయ్.. చివరిసారిగా 2021లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్ కెరీర్‌లో 13 మ్యాచ్‌లు ఆడిన రాయ్ 129 స్ట్రయిక్‌రేట్‌తో 329 పరుగులు చేశాడు. ఇందులో 2 హాఫ్‌సెంచరీలు ఉన్నాయి.బ్యాడ్‌న్యూస్ ఏంటంటే..గత కొన్ని సీజన్లుగా ఏదీ కలిసి రాక, ప్లేఆఫ్స్‌కు చేరేందకు కూడా అష్టకష్టాలు పడుతున్న కేకేఆర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు రీప్లేస్‌మెంట్ దొరికాడు అనుకునే లోపే మరో కీలక ఆటగాడు షకీబ్ అల్ హసన్ సీజన్ మొత్తానికే అందుబాటులో ఉండడం లేదని బాంబు పేల్చాడు.అంతర్జాతీయంగా ఉన్న కమిట్‌మెంట్లు, వ్యక్తిగత కారణాల చేత ఐపీఎల్-2023కు అందుబాటులో ఉండటం కుదరదని షకీబ్ పేర్కొన్నట్లు తెలుస్తోంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**